# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 214 పేజీలు : 8 వెల : రూ.2/- శనివారం 29 ఆగస్టు 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## నియోజకవర్గాల విజన్ ప్లాన్ అమలు
# పనితీరుకు ప్రామాణికం

**విజన్ ప్లాన్ పై ప్రజా ప్రతినిధులు నిరంతరం సమీక్షించాలి**

**ప్రజల భాగస్వామ్యంతోనే మెరుగైన ఫలితాలు**

**నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లపై ముఖ్యమంత్రి సమీక్ష**



**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 28:** రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచేందుకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పేదరిక నిర్మూలన, ప్రజా సమస్యల త్వరిత పరిష్కారం, సుపరి పాలనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్ అమలుపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సు లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీలు, ఎమ్మెల్యేలు, యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్టనర్స్ తో సీఎం మాట్లాడారు. నియోజక వర్గాల వారీగా విజన్ ప్లాన్ రూపొందించుకుని పని చేయడం దేశంలోనే ప్రధమంగా ఏపీలోనే అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. దీనికి జాతీయ స్థాయిలో మంచి పేరు వచ్చిందని చెప్పారు. ఈ క్రమంలో నియోజకవర్గాల విజన్ ను సమర్థవంతంగా అమలు మిగతా2లో...

## సోదరీమణులకు పవన్ కళ్యాణ్
# రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు



**మంగళగిరి,మన జనప్రగతి ఆగస్టు 28:** అక్కాచెల్లెళ్లతో అన్నదమ్ములకున్న ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) పర్వదినం సందర్భంగా సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. రాఖీ పౌర్ణమి భారతీయ కుటుంబ వ్యవస్థతో పెనవేసుకున్న బంధాలు, బాంధవ్యాలు, బాధ్యతలకు మిగతా2లో...

# లెగసీ వేస్ట్ తొలగింపు

**- ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్‌ల ఏర్పాటు పనులపై మంత్రి నారాయణ సమీక్ష**



**అమరావతి, మన జనప్రగతి ఆగస్టు 28:** లెగసీ వేస్ట్ తొలగింపు,ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ ల ఏర్పాటు పనులపై మంత్రి నారాయణ సెక్రటేరియట్ లో సమీక్ష నిర్వహించారు. మిగతా2లో...

## 2047 నాటికి 50 శాతం
# పచ్చదనమే లక్ష్యం

**- ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా నాగబాబు బాధ్యతల స్వీకరణ**

- పర్యావరణ పరిరక్షణలో ప్రజలనూ భాగస్వాములను చేస్తాం
- మొక్కలు నాటడమే కాదు.. వాటి మనుగడకూ ప్రత్యేక దృష్టి
- అన్ని శాఖలనీ సమన్వయం చేసుకొని లక్ష్యాలను సాధిస్తాం




**మంగళగిరి,మన జనప్రగతి ఆగస్టు 28:** ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా నాగబాబు బాధ్యతలు స్వీకరణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అటవీ, వృక్ష సంపదను విస్తరించి 2047 నాటికి మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా బాధ్యతలు నిర్వర్తిస్తానని తెలిపారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజలందరూ భాగస్వామ్యమయ్యే మహోద్యమంగా తీర్చిదిద్దేం దుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. "ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించడం ఎంతో గౌరవంగా, బాధ్యతగా భావిస్తున్నాను. తనపై నమ్మకం మిగతా2లో...

## క్రెడిట్ చోరీ జగన్‌కే
# అలవాటు

- డిఎస్సీపై చర్చకు సిద్ధమన్నా జవాబేది
- మంత్రి లోకేశ్ మరోమారు విమర్శలు


2లో

# జగన్‌కు విమర్శలు తప్ప మరోటి తెలియదు



**ఎన్నో అసెంబ్లీ సమావేశాలు జరిగినా ఎందుకు రాలేదు**

**జగన్ తీరుపై మండిపడ్డ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

**శ్రీకాకుళం,మన జనప్రగతి ఆగస్టు 28:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం మిగతా2లో...

## స్థానిక ఎన్నికలకు
# జనసేన సన్నద్ధం

- పొత్తు ధర్మం ఆధారంగా ఎన్నికల్లో పోటీ
- విధివిధానాలపై 14మందితో జనసేన కమిటీ



**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 28:** స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన సన్నద్ధమవుతోంది. ఈక్రమంలోనే విధివిధానాల రూపకల్పనపై 14 మంది సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలపై తొలి సమావేశం శుక్రవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో జరిగింది. ఆయా జిల్లాల వారీగా బలాబలాలు, పోటీ చేసే స్థానాలపై ఈ సమావేశంలో అగ్రనేతలు చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, మిగతా2లో...

# మూడు దశాబ్దాల వెలుగొండ కల సాకారం

- అర్హులైన ప్రతి నిర్వాసితుడికీ పరిహారం
- రికార్డుల్లో లోపాలున్నా ఆందోళన అవసరం లేదు
- రూ.169 కోట్ల అదనపు భారమైనా ప్రతి నిర్వాసితుడికి న్యాయం చేస్తాం
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 28:** ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలనే మూడు దశాబ్దాల వెలుగొండ కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం విలువైన భూములు, ఆస్తులు, స్వగ్రామాలను త్యాగం చేసిన మిగతా2లో...

# పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

**- డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడి**




**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 28:** పోలీసు సిబ్బంది సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. మంగళగిరి బెటాలియన్‌లో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు డీజీపీ శంకుస్థాపన చేశారు. 'విహార', 'విహారి' ట్రాన్సిట్ వసతి భవనాలకు, సెంట్రల్ పోలీస్ క్యాంటీన్‌కు మంగళగిరి ఒఖాఖ 6వ బెటాలియన్‌లో మిగతా2లో...

మనజనప్రగతి



# నియోజకవర్గాల విజన్ ప్లాన్ అమలు పనితీరుకు ప్రామాణికం

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. **వినూత్నంగా ఆలోచించాలి... మెరుగైన సేవలు అందించాలి** ప్రస్తుత పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారుతున్నాయని, ఈ ఇబ్బందుల నుంచి వారిని గట్టెక్కించేందుకే సంజీవని, తల్లికి వందనం వంటి వినూత్న పథకాలను తెచ్చామని సీఎం వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై విద్యా భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే అధికారులు, ప్రజా ప్రతినిధులు సాంప్రదాయ ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా విజన్ ప్లాన్‌ను వర్తింపజేస్తూ సమస్యలకు తగిన పరిష్కారాలు చూపాలని కోరారు. పరిపాలనలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం అత్యంత కీలకమని, అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలు కావాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ఏపీఎస్ డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# 2047 నాటికి 50 శాతం పచ్చదనమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఉంచి ఈ కీలక బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు. ఏపీ గ్రీన్ సొసైటీ నిర్దేశించుకున్న లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేందుకు పూర్తి చిత్తశుద్ధితో కృషి చేస్తాను. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణం అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాల సాధనకు ఏపీ గ్రీన్ ద్వారా కృషి చేస్తాను. పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యం ప్రస్తుతం రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 22.96 శాతంగా ఉంది. రాబోయే 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, వృక్ష సంపదను కలిపి పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే మా ప్రధాన లక్ష్యం. ఇది కేవలం గణాంకాల కోసం పెట్టుకున్న లక్ష్యం కాదు. భావి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణం, మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. వాతావరణ మార్పులు ప్రపంచానికి సవాలుగా మారుతున్న ఈ సమయంలో పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి బాధ్యత. అందుకే ఏపీ-గ్రీన్ కార్యక్రమాన్ని కేవలం అడవులకే పరిమితం చేయకుండా, రాష్ట్రంలోని ప్రతి అనుకూలమైన ప్రాంతంలో పచ్చదనాన్ని పెంచేలా కార్యాచరణ చేపడుతున్నాము. వ్యవసాయ భూములు, గ్రామాలు, పట్టణ ప్రాంతాలు, ప్రధాన రహదారుల ఇరువైపులా, కాలువ గట్లు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ప్రాంగణాలు, పరిశ్రమల పరిసరాలు, అనుకూలమైన బంజరు భూములు ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తాం. పెద్ద ఎత్తున మొక్కల పెంపకం, తోటల అభివృద్ధిని ప్రోత్సహిస్తాం. ఈ బృహత్తర లక్ష్యం విజయం కావాలంటే ఒక్క శాఖతో సాధ్యమయ్యేది కాదు. వ్యవసాయం, ఉద్యానవనం, పంచాయతీరాజ్, విద్య, పరిశ్రమలు, రెవెన్యూ, జలవనరులు, రవాణా, అటవీ శాఖలతోపాటు అన్ని సంబంధిత ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాం. ఏపీ గ్రీన్ కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా మాత్రమే ఉండకూడదు. రైతులు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత సంస్థలు, విద్యార్థులు, యువత, పారిశ్రామికవేత్తలు, ప్రతి పౌరుడిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలనుకుంటున్నాం. ఏపీ-గ్రీన్‌ను ఒక ప్రభుత్వ పథకంగా కాకుండా, ప్రజలందరూ భాగస్వామ్యమయ్యే గొప్ప ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. మొక్కలు నాటడం మాత్రమే మా లక్ష్యం కాదు. నాటిన మొక్కలను బతికించడం, వాటిని సంరక్షించడం, అవి ఆరోగ్యంగా ఎదిగేలా చూడటమే అసలైన బాధ్యత. నాటిన ప్రతి మొక్క మనుగడపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. వాటి సంరక్షణ, నిర్వహణ కోసం ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తాం" అన్నారు.

# స్థానిక ఎన్నికలకు జనసేన సన్నద్ధం

(మొదటి పేజీ తరువాయి)

కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు. స్థానిక ఎన్నికలపై మంత్రి కందుల దుర్గేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో ముందు కొచ్చిన జనసైనికులు, వీరమహిళలు ఆత్మగౌరవాన్ని కాపాడుతూ ఈ ఎన్నికల్లో కూటమి పార్టీల పొత్తుధర్మం పాటిస్తామని వ్యాఖ్యానించారు. స్థానిక ఎన్నికలపై కీలక అంశాలపై చర్చించామని మంత్రి తెలిపారు. యూత్‌ను లీడర్ షిప్ దిశగా తీసుకెళ్లేలా నిర్ణయించామని అన్నారు. ఈ ఎన్నికలపై 25 పార్లమెంట్‌లకు ప్రాతినిధ్యం అప్పగిస్తారని వెల్లడించారు. సెప్టెంబరు నెల అంతా పార్టీ బలోపేతం, నాయకత్వం బలంగా ఉండేలా చూసుకుంటామని చెప్పుకొచ్చారు. స్థానికంగా ఉండే పరిస్థితుల ఆధారంగా పోటీ చేయడంపై దృష్టిపెడతామని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో స్థానిక ఎన్నికల్లో జనసేన ఎక్కడ పోటీ చేయాలనే విషయాలపై ఆత్మీయ సమావేశంలో చర్చించామని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి తెలిపారు. 2019 కంటే జనసేన ప్రాబల్యం పెరుగుతోందని అన్నారు. రానున్న ఎన్నికల్లో సీట్ల శాతం పెరిగితే బాగుంటుందని అనుకుంటున్నామన్నారు. తాము పోటీ చేసే స్థానాల్లో గెలవాలని నిర్ణయించామని తెలిపారు. క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ లేని వారిని స్థానిక ఎన్నికల్లో గెలిపించాలని నిర్ణయించామని ఎంపీ బాలశౌరి పేర్కొన్నారు. జనసేన స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత ఆత్మీయ సమావేశంలో అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో తెగువతో పోటీ చేసిన 1000 మంది జనసేన అభ్యర్థులను సత్కరించారు. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అభ్యర్థులకు ఘనంగా సన్మానించారు. 1000 మంది అభ్యర్థులను మంత్రి నాదెండ్ల మనోహర్ సత్కరించారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసిన వారికి జనసేన పార్టీ గౌరవం ఇచ్చింది. అభ్యర్థుల సత్కారంతో ఈ ఎన్నికల సన్నద్ధత సమావేశం ప్రారంభమైంది. ఈ ఎన్నికల్లో పార్టీ కోసం నిలబడిన వారికి జనసేన అధినాయకత్వం ప్రత్యేక గౌరవం ఇచ్చింది.

# జగన్‌కు విమర్శలు తప్ప మరోటి తెలియదు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. జగన్ రెడ్డికి కేవలం తమ ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప.. ఆయనకు పని ఏమీ లేదని విమర్శించారు. ఈ రెండున్నరేళ్లలో ఎన్నో అసెంబ్లీ సమావేశాలు జరిగాయని... కానీ ఒక్కసారి కూడా అసెంబ్లీకి జగన్ వచ్చి ఏ ఒక్క సమస్యపైన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లాలో రామ్మోహన్ నాయడు పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేవలం జగన్ రాజకీయ పబ్బం గడిపేందుకే తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన చేసిన విమర్శల్లో ఏ ఒక్క ఆధారం కూడా చూపించలేక పోయారని పేర్కొన్నారు. ఏపీకి టీడీపీ హయాంలోనే డీఎస్సీలు వచ్చాయి తప్ప.. వైసీపీ హయాంలో ఒక్క ఉద్యోగం కూడా రాలేదని రామ్మోహన్ చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో జాబ్ క్యాలెండర్ ఇస్తానని అన్నారని.. ఒక్క జాబ్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. డబుల్ ఇంజన్ సర్కార్‌లో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సమస్యలు పరిష్కారిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో 16 వేల మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. సంవత్సరం తర్వాత డీఎస్సీపైన, మంత్రి లోకేశ్‌పైన జగన్ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని డెవలప్ చేసేందుకు అన్నివిధాలా ప్రయత్నం చేస్తోందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం ఏపీని అభివృద్ధి చేస్తుంటే జగన్ జీర్ణించుకోలేక రాష్ట్రాన్ని విధ్వంసం చేయాలని ఆలోచిస్తున్నారని ఆగ్రహించారు. జగన్‌కు 151 సీట్లు ఇచ్చి ప్రజలు గెలిపించి ముఖ్యమంత్రిని చేశారని.. కానీ వైసీపీ హయాంలోని ఐదేళ్లు విధ్వంసం సృష్టించారని రామ్మోహన్ దుయ్యబట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేసి 16,000 ఉద్యోగాలను ఇచ్చారని ప్రస్తావించారు. జగన్ ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రజావేదికను కూల్చారని ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లు విధ్వంసం సృష్టించడంతోనే జగన్‌ను రాష్ట్ర ప్రజలు ఓడించారని అన్నారు. అయినా ఆయన విధ్వంసాన్ని విడిచి పెట్టలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. జగన్ సంకల్పం రాష్ట్రం సర్వనాశనం అయిపోవాలని, యువతకు ఉద్యోగాలు రాకూడదని కుట్రలకు పాల్పడుతున్నారని రామ్మోహన్ నాయుడు ధ్వజమెత్తారు.

# మూడు దశాబ్దాల వెలుగొండ కల సాకారం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. 1996లో ముఖ్యమంత్రి చంద్రబాబు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 ఆగస్టు నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యాన్ని ముఖ్యమంత్రి నిర్దేశించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో వెలుగొండ ప్రాజెక్టు పనుల కోసం సుమారు రూ.2,250 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి, రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తూ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసిందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం బాధ్యతలు చేపట్టే సమయానికి వెలుగొండ హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించిన వింగ్స్, వాల్స్ పనులు పూర్తికాని పరిస్థితి ఉండేదని చెప్పారు. 2025 మేలో పనులు ప్రారంభించి, 2026 మే నాటికి హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించిన వింగ్స్, వాల్స్ పనులను పూర్తి చేసినట్లు వివరించారు. టన్నెల్-1 కు సంబంధించి సుమారు 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు పనులు, టన్నెల్-2కు సంబంధించి సుమారు 4,990 మీటర్ల బెంచింగ్ పనులు, 6,990 మీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేసినట్లు మంత్రి వెల్లడించారు.

వెలుగొండ ప్రాజెక్టులో కీలకమైన 11,000 క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన ఫీడర్ కెనాల్ పనులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని మంత్రి తెలిపారు. ఈ పనులకు సుమారు రూ.5,460 కోట్ల నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలిచి పనులను వేగవంతం చేసినట్లు చెప్పారు. ఫీడర్ కెనాల్‌లో భాగంగా 5.3 కిలోమీటర్ల పీసీ వాల్ నిర్మాణం, 11 కిలోమీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేసినట్లు మంత్రి వివరించారు. ప్రాజెక్టు డిజైన్‌లోని కీలక పనులను దశలవారీగా పూర్తి చేస్తూ వెలుగొండ ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం ఎంత ముఖ్యమో, ప్రాజెక్టు కోసం త్యాగాలు చేసిన నిర్వాసితుల సంక్షేమం కూడా ప్రభుత్వానికి అంతే ముఖ్యమని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు సుమారు రూ.900 కోట్లు చెల్లించాల్సి ఉండగా, గత ఐదేళ్లలో వారికి ఎలాంటి చెల్లింపులు జరగలేదని మంత్రి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కేవలం 40 రోజుల్లో మూడు విడతల్లో సుమారు రూ.768 కోట్లను నిర్వాసితులకు చెల్లించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. వెలుగొండ ప్రాజెక్టు పరిధిలోని 11 ముంపు గ్రామాలకు 11 కమిటీలను ఏర్పాటు చేసి, జిల్లా స్థాయి అధికారులు, జలవనరుల శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో నిర్వాసితుల గ్రీవెన్స్‌లను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు, ఆస్తులను త్యాగం చేసిన ప్రతి ఒక్క నిర్వాసితుడికి న్యాయం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సామాజిక, ఆర్థిక సర్వేలో పేరు లేకపోయినా, గెజిట్‌లో నమోదు కాకపోయినా, కొత్త ఇల్లు ఉన్నా లేకపోయినా, పేర్లలో తేడాలు ఉన్నా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు.

# సోదరీమణులకు పవన్ కళ్యాణ్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఓ భావోద్వేగపూరిత సంకేతం. సోదర భావాన్ని, మహిళలకు గౌరవాన్ని, భరోసాని అందించే పండుగ. రాఖీ పౌర్ణమి వేళ రాష్ట్రంలో మహిళల భద్రత, మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ముందుకు వెళ్తుందన్న విషయాన్ని పునరుద్ఘాటిస్తున్నాం. ఇప్పటికే దీపం-2 ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, స్త్రీ శక్తి పథకాలను విజయవంతంగా అమలు చేస్తోంది కూటమి ప్రభుత్వం. డోలీ రహిత గిరిజన గ్రామాల కల సాకారం దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నాం. ఇప్పటికే 426 గిరిజన ఆవాసాలను రోడ్లతో అనుసంధానించడమైనది. అడవితల్లి బాట ఫేజ్-2 ద్వారా ఈ రోడ్లను మరింత విస్తరించే దిశగా చర్యలు చేపట్టాం. గిరిజన మహిళల్లో కనిపించే జన్యుపరమైన వ్యాధి సికిల్ సెల్ అనీమియా నుంచి రక్షణ కల్పించేందుకు అరకులో ప్రత్యేక బ్లడ్ బ్యాంకును ఏర్పాటు చేస్తున్నాము. ఆడపడుచుల అభ్యున్నతి, సాధికారత దిశగా ముందుకు వెళ్తామని రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలియచేస్తున్నాము...మీపవన్ కళ్యాణ్.

# లెగసీ వేస్ట్ తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశానికి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ సునీల్ కుమార్ రెడ్డి, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... గత ప్రభుత్వం వదిలి వెళ్లిన 150 లక్షల టన్నుల లెగసీ వేస్ట్ ను పూర్తిగా తొలగిస్తున్నాం అన్నారు. భూమిపైన ఉన్న వేస్ట్ ను ఇప్పటికే పూర్తిగా తొలగించామని, భూమి లోపల ఉన్న చెత్తను కూడా అక్టోబర్ 2 వ తేదీ నాటికి పూర్తిగా తొలగిస్తామని అన్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న 6 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ల ద్వారా ఏ రోజు చెత్త అదే రోజు పూర్తిగా విద్యుత్ గా మారుస్తాం అన్న మంత్రి ఈలోగా ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ లు నెలకొల్పుతున్నట్లు చెప్పారు. ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. అక్టోబర్ 2 నుంచి మొత్తం చెత్త అంతా ప్లాంట్ లకు తరలించాలన్న నారాయణ డంపింగ్ యార్డ్ రహిత మున్సిపాలిటీలుగా ఏపీని మారుస్తాం అన్నారు.

# క్రెడిట్ చోరీ జగన్‌కే అలవాటు

**ఒంగోలు,మన జనప్రగతి ఆగస్టు 28:** తాము చేసిన పనుల క్రెడిట్‌ను చోరీ చేసే వ్యక్తి జగన్ అని మంత్రి లోకేశ్ విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయకుండా అప్పట్లోనే ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఒంగోలులో మంత్రి లోకేశ్ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా వైకాపాపై విమర్శలు గుప్పించారు. డీఎస్సీపై చర్చించేందుకు ఎక్కడికైనా వస్తా.. సిద్ధమా? అని వైకాపా అధినేత జగన్‌కు మరోమారు సవాల్ విసిరారు. ఈ ఏడాది.. వచ్చే ఏడాది సైతం డీఎస్సీ నిర్వహిస్తామన్నారు. వైకాపా హయాంలో చేసిన తప్పులకు కొందరు జైళ్లకు వెళుతున్నట్లు మంత్రి లోకేశ్ చెప్పారు. వైకాపా ప్రభుత్వ హయాంలో బీసీలను అనేక ఇబ్బందులకు గురిచేసినట్లు తెలిపారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై దొంగ కేసులు పెట్టారన్నారు. కార్యకర్తలు తమను సంప్ర దిస్తే దొంగ కేసులు ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఒంగోలులో పోతురాజు కాలువ బాగుచేసే బాధ్యత తీసుకుంటానన్నారు. దామచర్ల జనార్దన్ గెలిచాక ఒంగోలు రూపురేఖలు మారా యన్నారు. ఈ నగరంలో నీటి కొరత ఉందని.. అమృత్ ద్వారా సమస్య పరిష్కరించనున్నట్లు లోకేశ్ తెలిపారు.

# పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మీడియాతో మాట్లాడారు. పురుష పోలీసు సిబ్బంది కోసం 'విహార'ను ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ తెలిపారు. మహిళా పోలీసు సిబ్బంది కోసం 'విహారి'ను ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు. ఒక్కో భవనాన్ని 13,603 చదరపు అడుగుల్లో నిర్మిస్తున్నారని వివరించారు. బందోబస్తు, అధికారిక పనులపై మంగళగిరికి వచ్చే సిబ్బందికి సురక్షిత, సౌకర్యవంతమైన వసతి కల్పిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. 20 వేల చదరపు అడుగుల్లో ఆధునిక సెంట్రల్ పోలీస్ క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ తెలిపారు. 'విహార', 'విహారి'తో పురుష, మహిళా సిబ్బందికి మెరుగైన వసతి కల్పిస్తామని అన్నారు. సెంట్రల్ పోలీస్ క్యాంటీన్‌తో సిబ్బంది, కుటుంబాలకు మరింత మెరుగైన సంక్షేమ సేవలు అందుతాయని వెల్లడించారు. ఆయా నిర్మాణాల్లో, నాణ్యత విషయంలో రాజీపడవద్దని ఆదేశించారు. మూడు ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశించారు.

# మంత్రి అనిత ఇంట్లో శ్రావణ శుక్రవారం పూజ

- మహిళలకు చీరెసారెలు సమర్పించిన మంత్రి



**అనకాపల్లి,మన జనప్రగతి ఆగస్టు 28:** నక్కపల్లిలోని తన నివాసంలో హోం మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం శ్రావణమాస వ్రతం నిర్వహించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వేదిక వద్ద వేద పండితుల ఆధ్వర్యంలో ఈ క్రతువును కుటుంబ సభ్యులతో కలిసి చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పెద్దఎత్తున మహిళలు హాజరయ్యారు. పూజ అనంతరం వారికి చీరలు, వాయినాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాలుగేళ్లగా ఈ కార్యక్రమం చేపడుతునన్నట్లు చెప్పారు. ప్రజలందరి ఆశీస్సులు తనపై ఉండాలన్నారు. వచ్చే నెల 2న నియోజకవర్గానికి పోలవరం నీళ్లు వస్తున్నాయని, సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమానికి జల హారతి ఇవ్వనున్నారని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.

# చంద్రబాబుతో నాగబాబు భేటీ



**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 28:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కలిశారు. నేడు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును సతీసమేతంగా కలిశారు. ఈ సందర్భంగా నాగబాబును సత్కరించి సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు.

మనజనప్రగతి

29- 08 - 2026

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

**● నందవరం మండల కేంద్రంలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**



**కర్నూలు బ్యూరో నందవరం మన జనప్రగతి ఆగస్టు 28:-**నియోజకవర్గ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఒక్క నెలఒక నియోజకవర్గంనాలుగు పర్యటనలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నాల్గవ పర్యటన నిర్వహించారు.ఈ సందర్భంగా నందవరం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఆదోని రెవెన్యూ డివిజనల్ అధికారి అరుణ దేవి, ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలతో పాటు రెవెన్యూ, తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుధ్యం, గృహ వసతి, పింఛన్లు, ఇతర మౌలిక సదుపాయాలు మరియు స్థానిక ప్రజా సమస్యలకు సంబంధించిన అర్జీలను అధికారులకు అందజేశారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిపత్రాన్ని పరిశీలించి, సంబంధిత సమస్యల అర్జీలను ఆయా శాఖలకు పంపించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హత కలిగిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సిన పరిస్థితి లేకుండా, అందిన వినతులపై బాధ్యతాయుతంగా స్పందించి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కామేశ్వర ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ, బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన్న, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్, జిల్లా రిజిస్టర్ బజారి, తదితరులు పాల్గొన్నారు.

# బద్వేల్ వైపు ఆర్టీసీ బస్సుల సమయపాలన కరువు

**● భాకరాపేటలో ప్రయాణికుల అవస్థలు ● బస్టాండ్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి**



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 28:-** మండలంలోని భాకరాపేట గ్రామంలో బద్వేల్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం బస్సుల కోసం చాలాసేపు వేచి చూసిన ప్రయాణికులు పోరుమామిళ్ల, కలసపాడు, బద్వేల్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. భాకరాపేటలో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు సరైన బస్టాండ్ సౌకర్యం లేకపోవడంతో ఎండ, వర్షాలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, వృద్ధులు బస్సుల కోసం రోడ్డుపై వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ అధికారులు భాకరాపేట మీదుగా నడిచే బస్సుల సమయాలను క్రమబద్ధీకరించి, నిర్ణీత సమయాలకు సర్వీసులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే ప్రయాణికుల సౌకర్యార్థం భాకరాపేటలో బస్టాండ్ లేదా కనీసం షెల్టర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# క్రీడా ప్రతిభ పురస్కారాలకు రామనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఎంపిక



**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 28:-**కడప జిల్లా క్రీడా ప్రతిభ పురస్కారాలకు రామనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచినందుకు పురస్కారాలు అందుకుంటున్నారు, హాకీ మాంత్రికుడు శ్రీ ద్యాన్ చంద్ గారి పుట్టినరోజు సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రతీ ఏడాది ఆగష్టు 29 న నిర్వహిస్తారు.ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతీ జిల్లాకు 5 స్కూల్ లను ఎస్ జి ఎఫ్ లో వారి పాఠశాల సాధించిన పాయింట్స్ ఆధారంగా క్రీడా ప్రతిభ పురస్కారాలతో సన్మానిస్తారు. వైస్సార్ కడప జిల్లాలో చెన్నూరు మండలం రామనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలఎంపిక అయినది.విద్యార్థులు రాష్ట్రస్థాయి జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు అవార్డులు అందుకుంటారు, అవార్డుల ప్రధాన ఉత్సవం శనివారం సాయంత్రం మూడు గంటలకు కడప డిఇఓ సభా భవనంలో నిర్వహిస్తారు,ఈ కార్యక్రమానికి రామనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పి గణేష్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి ఉమామహేశ్వరి పాల్గొంటారు.

# అన్నమయ్య జిల్లా గణేష్ ఉత్సవ సమితి ఎస్పీతో సమావేశం



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 28:-** అన్నమయ్య జిల్లా గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు అన్నమయ్య జిల్లా ఎస్పీ ని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ సహకారాన్ని కోరడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల గణేష్ ఉత్సవ సమితుల ఏర్పాట్లు, ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన అంశాలను ఎస్పీ గారికి వివరించడం జరిగింది. ఉత్సవాల సమయంలో భక్తులకు, మండపాల నిర్వాహకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు కూన విజయ్ , ప్రధాన కార్యదర్శి చింతపర్తి మహేష్ , ప్రచార కార్యదర్శి లయన్.ఆంజనేయ రెడ్డి ,లయన్ సాయినాథ రెడ్డి .రాష్ట్ర కమిటీ సభ్యులు విటపు మురళీమోహన్ రెడ్డి మరియు సి. సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

# పెద్దపాడులోని బాలసదనం ఆకస్మిక తనిఖీ





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 28:-**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయం 8.15 గంటలకు పెద్దపాడులోని బాలసదనాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. శుక్రవారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, మరియు ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ వారి ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్థి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీల వెంకట శేషాద్రి పెద్దపాడులోని బాలసదనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీ సమయంలో బాలసదనంలో సంబంధిత సిబ్బంది ఎవరూ విధుల్లో లేకపోవడం గమనించారు. కేవలం వంటమనుషులు శివమ్మ, మునెమ్మ పిల్లలకు అల్పాహారం అందిస్తుండగా, సుమలత, హెల్పర్ మాత్రమే అక్కడ విధుల్లో ఉన్నట్లు గుర్తించారు. తనిఖీలో భాగంగా, పిల్లలకు నిర్ణీత మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు గుడ్డు అందించాల్సి ఉండగా, గుడ్డు అందించకపోవడంపై వంటమనిషి శివమ్మను ప్రశ్నించగా, ఆమె ఉదయమే పిల్లలకు గుడ్లు అందించామని తెలిపారు. అయితే, మరో వంటమనిషి మునెమ్మ మాత్రం గుడ్లు ఇంకా అందించలేదని, వాటిని ఉడకబెట్టాల్సి ఉందని తెలిపినట్లు గమనించారు. అనంతరం పిల్లలను విచారించగా, తమకు గుడ్లు అందించలేదని తెలిపారు. సంబంధిత సిబ్బంది పిల్లలు వాస్తవ విషయాలను ఎవరికీ తెలియజేయకుండా ఒత్తిడి చేస్తున్నారని, చెప్పినట్లయితే అమాయక పిల్లలను మందలిస్తున్నారనే అంశం కూడా విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై ప్రశ్నించినప్పుడు వంటమనిషి శివమ్మ పెద్ద స్వరంతో స్పందిస్తూ గుడ్లు ఇప్పటికే అందించామని పేర్కొన్నారు. అలాగే, తాను విధులకు ఆలస్యంగా హాజరైన విషయాన్ని కూడా ఎటువంటి సంకోచం లేకుండా వెల్లడించడం ద్వారా బాలసదనంలో నెలకొన్న పరిస్థితులు మరియు సిబ్బంది విధుల పట్ల చూపుతున్న నిర్లక్ష్యం స్పష్టమవుతున్నట్లు కార్యదర్శి పేర్కొన్నారు. ప్రభుత్వం పిల్లల సంక్షేమం కోసం అనేక నూతన పథకాలను అమలు చేస్తూ, బాలల సంరక్షణ మరియు అభివృద్ధి కోసం అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటోంది. అయినప్పటికీ, సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలు దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా, సిబ్బంది హాజరును పర్యవేక్షించేందుకు బయోమెట్రిక్ హాజరు పరికరాలు లేకపోవడం, బాలసదనం ప్రాంగణంలో పిల్లల భద్రత మరియు పర్యవేక్షణ కోసం సరైన నిఘా వ్యవస్థ లేదని కూడా గుర్తించారు. బాలసదనంలో గణనీయమైన సంఖ్యలో పిల్లలు నివసిస్తున్న నేపథ్యంలో పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ అవసరమని తెలిపారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని, బాలసదనం నిర్వహణలో చోటుచేసుకున్న లోపాలు మరియు నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కోరారు.


# సామాజిక అంశాల అంతరంగం 'కడలి తరంగం' పుస్తకం



**● వీ.సీ ఆచార్య బి.జయరామిరెడ్డి**

**కడప మన జనప్రగతి ఆగస్టు 28:-**సమాజాన్ని నిశితంగా పరిశీలించి జార్జి జ్యోతి రాసిన కథలు హృదయా న్ని కదిలించి కన్నీళ్లు తెప్పిస్తా యని డా వైయస్సార్ ఆర్కి టెక్చర్ అండ్ ఫైనార్ట్స్ విశ్వవి ద్యాలయం ఉపకులపతి ఆచార్య బి. జయరామిరెడ్డి అన్నారు. వైయ స్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విశ్వ విద్యాలయం ఉపకులపతి సమావేశ మందిరంలో రచయిత జార్జి జ్యోతి చిత్రించిన "కడలి తరంగం" కథల సంపుటిని వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఈనాటి సమాజంలో ఉన్న సమస్యలనే రచయిత కథల్లో చెప్పారని, కడలి తరంగం శీర్షికకు తగినట్లుగానే అల తీరాన్ని తాకి వెనుదిరిగినా దాని తడి ఇసుకపై ఎలా మిగిలి పోతుందో ఈ కథలు కూడా పాఠకులు చదివిన తర్వాత ఆ కథలకు సంబంధించిన ఆలో చనలు మాత్రం కొంతకాలం నిలిచే ఉంటాయని, మనిషి హృదయాన్ని ఆవిష్కరించే చక్కని కథలు రాసిన జార్జి అభినందనీయుడన్నారు. వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ప్రసంగిస్తూ ఇందులో కడలి తరంగం, నవవసంతం,స్ఫూర్తి ప్రదాత,కూతురే నా ప్రాణం,ఇదే నా సమాజం,నేనొక నిషిద్ధ మనిషిని కథలున్నాయని, ఈ కథలను రచయిత సమాజంలో మనుషుల మధ్యనున్న ఎన్నోకో ణాల్ని పరిశోధించి,పరిశీలించి హృదయ విదారకంగా చిత్రిం చారని, ప్రతి కథ పాఠకుని కదిలించి ఆలోచింపజేస్తుం దన్నారు. కథా రచయిత జార్జి జ్యోతి స్పందిస్తూ మనసులో అంకురించే నూతన ఆలోచనల కు అక్షర రూపం ఇవ్వడమే కథలకు మూలమని, ఇందులో నా కళ్ళ ముందు జరిగిన వాస్తవ సంఘటనలనే కథలుగా రాశానని జిల్లా రచయితల ఆధ్వ ర్యంలో విశ్వవిద్యాలయంలో ఉప కులపతి ఈ కథల సంపుటి ఆవిష్కరించబడడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. అనం తరం కథా రచయిత జార్జి జ్యోతిని ఘనంగా సత్కరించా రు. కార్యక్రమంలో రచయితల సంఘం కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి, సభ్యులు డాక్టర్ వెల్లాల వెంక టేశ్వరాచారి, విశ్వవిద్యాల యం అధ్యాపకులు డాక్టర్ భూతపురి శివరామ సురేంద్ర శర్మ, వై మనో హరరావు. కస్తూరి అప్పలనా యుడు, ఆకెపోగు జయచం ద్రారావు పాల్గొన్నారు.

# కాకినాడలో గ్రామాల విలీనానికై సిపిఎం కరపత్రం విడుదల



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 28:-**కాకినాడ రూరల్ లోని ఆరు గ్రామాలను కాకినాడ కార్పొరేషన్లో విలీనం చేసి ఎన్నికలు నిర్వహించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు(నానాజీ) రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ ఇవ్వాలని సిపిఎం కోరింది. ఈ మేరకు సిపిఎం చేపట్టిన విలీన గ్రామాల నిరవధిక ఉద్యమంలో భాగంగా ఆరు గ్రామాల్లో ఇంటింటికి కరపత్రం ప్రచారానికి ముద్రించిన కరపత్రాన్ని కలెక్టర్ కార్యాలయం వద్ద పార్టీ విడుదల చేసింది.పార్టీ రూరల్ కమిటీ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థ అధికారి, ప్రజా సేవకుడు ఎస్ఆర్ శంకరన్ ఆశయాలకు అనుగుణంగా విలీన గ్రామాల ఉద్యమాన్ని చేపట్టామని, దీనికి ప్రజల సహకరించాలని కోరారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ అడ్వకేట్ పేపకాయల రామకృష్ణ మాట్లాడుతూ పదిహేనేళ్లుగా గ్రామాలకు ఎన్నికలు లేకపోవడం న్యాయం కాదని, 73 - 74 రాజ్యాంగ సవరణకు భిన్నమన్నారు. సహజంగా కాకినాడ నగరం విస్తరించాలన్నా,నూతనంగా అభివృద్ధి కావాలన్నా చుట్టుపక్కల గ్రామాలు విలీనం కాకుండా ఇది సాధ్యం కాదన్నారు. గ్రామాల విలీనంకు ఏ రాజకీయ పార్టీ వ్యతిరేకించడం లేదని, కానీ విలీన ప్రక్రియ పూర్తి చేయడంలో చొరవతీసుకోవడంలో లోపం జరుగుతుందని చెప్పారు. గ్రామాల విలీనానికి సిపిఎం చేపట్టిన ఉద్యమానికి మద్దతు తెలియజేసి ప్రజల విజ్ఞప్తిని పాలకులు నెరవేర్చాలని అయన కోరారు. సామాజిక కార్యకర్త, పూర్వ కాకినాడ కౌన్సిలర్ దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ మొదటి నుండి విలీన గ్రామాలను కార్పొరేషన్ లో విలీనం చేయాలని సిపిఎం నికరంగా ఉద్యమాలు కొనసాగిస్తూనే ఉందని కొనియాడారు. నేడు జరుగుతున్న ఈ ఉద్యమాన్ని పట్టుదలతో కొనసాగిస్తే రాబోయే ఎన్నికలకు విలీన ప్రక్రియ పూర్తయి ఈ ప్రాంతాల నుంచి కార్పొరేటర్లు ఎన్నికయ్యి వస్తారన్నారు. సిపిఎం నాయకులు చింతపల్లి అజయ్ కుమార్ మాట్లాడుతూ వచ్చే కార్పొరేషన్ ఎన్నికలలోపు గ్రామాలను విలీనం చేయాలనే పోరాటంలో ఆరు గ్రామాల వివిధ తరగతుల ప్రజానికాన్ని భాగస్వాములు చేస్తామని, ప్రజలను చైతన్య పరిచేందుకే వేలాది కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేస్తామని తెలిపారు.కార్యక్రమానికి ముందుగా మహనీయుడు శంకరన్ విగ్రహానికి మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఎం రామ్మోహన్, టి నాగేశ్వరరావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాన్ని సిపిఎం నాయకులు పెద్దింశెట్టి రామకృష్ణ సమన్వయం చేయగా ప్రజా సంఘాల నాయకులు టి రాజా, జుత్తుగ శ్రీనివాసరావు, సత్యనారాయణరెడ్డి, జోగా అప్పారావు, ఏవీ కృష్ణాజీ, ఆర్ఎస్పీ నాయకులు సతీష్, నాని, రమేష్ పాల్గొన్నారు.

## శ్రావణ శుక్రవారం సందర్భంగా శీతల గంగమ్మకు ప్రత్యేక పూజలు



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 28:**-మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వెంకటేశ్వరాపురం గ్రామానికి చెందిన ఉభయ దాతలు సామల చెంగయ్య కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పూజలు చేశారు. శ్రావణమాస పౌర్ణమి శుక్రవారం కావడంతో అమ్మవారి దర్శనానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పరిసరాలు భక్తుల రాకతో సందడిగా మారాయి. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

## రేషన్ డిపోల ద్వారా వంటనూనె, పంచదార సబ్సిడీపై పంపిణీ చేయాలి



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 28:**-నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వంటనూనె, పంచదార, ఎండుమిర్చి, చింతపండు తదితర వస్తువులను రేషన్ డిపోల ద్వారా సబ్సిడీపై పంపిణీ చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని భారతీయ జనతా పార్టీ నేత, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎనిమిరెడ్డి మాలకొండయ్య కోరారు.మధ్యప్రాచ్య దేశాల్లో నెలకొన్న యుద్ధ పరిస్థితులు, ఆర్థిక అనిశ్చితి ప్రభావంతో కొన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని తెలిపారు. ధరల పెరుగుదల సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతోందన్నారు. వారికి కొంత ఉపశమనం కల్పించేందుకు రేషన్ డిపోల ద్వారా కొన్ని నిత్యావసరాలను సబ్సిడీపై అందించే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. ఈ మేరకు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మంత్రి నాదెండ్ల మనోహర్, సివిల్ సప్లయిస్ కమిషనర్‌కు మాలకొండయ్య ఈ-మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు.కొన్ని ప్రాంతాల్లో స్వార్థపరులు నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై నిఘా పెంచడంతోపాటు అక్రమ నిల్వలు గుర్తిస్తే స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అవసరమైతే విజిలెన్స్ విభాగంతో దాడులు నిర్వహించాలని కోరారు. ఈ అంశంపై చర్చించేందుకు అవసరమైతే సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా పరిశీలించాలని మంత్రి, కమిషనర్‌ను మాలకొండయ్య కోరారు.

## పీలేరు ఎస్కేఆర్ ఆసుపత్రి వ్యవహారంపై పూర్తి విచారణ జరపాలి: ఇరగన్న డిమాండ్



**పీలేరు మన జనప్రగతి ఆగస్టు 28:** ఎస్కేఆర్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స కోసంవచ్చిన పేషెంట్ కె.సురేంద్ర మృతి ఘటనపై జిల్లా డిఎం హెచ్ ఓ,కలెక్టర్ ద్వారా విచారణ జరిపించాలని ఇలాంటి కేసులు పునరావృతం కాకుండా చూసుకోవలసిన బాధ్యత జిల్లా వైద్యాధికారుల మీద ఎంతైనా ఉందని అన్నమయ్య జిల్లా దళిత ఐక్యవేదిక కన్వీనర్ ఇరగన్న మాట్లాడుతూ...ఎస్.కే ఆర్ హాస్పిటల్ లో ఇలాంటి కేసులు జరగడం సరా మామూలు అయిందని ఏమైనా సంఘటన జరిగినప్పుడు హడావిడి చేసి చూసి వెళ్లే జిల్లా వైద్యాధికారులు తర్వాత ఏంజరుగుతుందో హాస్పిటల్ లో అనే విషయాన్ని నిమ్మకు నిరీత్తినట్లు ఉండడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తుందని మొత్తానికి హాస్పిటల్లో జరిగిన సంఘటనలు పై పూర్తి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేషెంట్ సురేంద్రకు మత్తు మందు ఇచ్చిన తర్వాత జరిగిన వైద్య ప్రక్రియ,అత్యవసర చికిత్స, పూర్తి మెడికల్ రికార్డులు, రిఫరల్ మరియు స్విమ్స్ వైద్య నివేదికలను నిపుణుల బృందంతో సమగ్రంగా పరిశీలించాలి.గతంలో ఆసుపత్రిపై వచ్చిన ఫిర్యాదులు,ఆరోపణలపైనా విచారణ జరపాలి.వైద్య నిర్లక్ష్యం నిర్ధారణైతే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత జిల్లా వైద్యాధికారుల పైన ఉందని తెలిపారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## మండుతున్న నిత్యావసర ధరలు పట్టించుకోని కూటమి ప్రభుత్వం

- ఉల్లి ధర సామాన్యుడి  కంట కన్నీళ్లు
- ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం:జమ్మలమడక



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 28:**-కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నా ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తోందని వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు.పేద, మధ్యతరగతి కుటుంబాలపై ధరల పెరుగుదల తీవ్ర భారం మోపుతోందని, కూరగాయలు, పప్పులు, నూనెలు, బియ్యం,చక్కెర వంటి నిత్యావసర వస్తువులతో పాటు ప్రస్తుతం ఉల్లిపాయ ధరలు కూడా సామాన్యులకు అందనంతగా పెరుగుతున్నాయని ఆమె అన్నారు. "ఉల్లిపాయ కోస్తే వచ్చే కన్నీళ్లకంటే.. ఉల్లిపాయ ధర చూసి సామాన్యుడి కళ్లలో వచ్చే కన్నీళ్లే ఎక్కువగా ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు.ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన సమయంలో ప్రచార ఆర్భాటానికే పరిమితమైందని ఇది చూస్తుంటే 'మీ మార్ట్' లకు ఆదాయాన్ని లాభాలను చేకూర్చే కుట్రలా కనిపిస్తుందని నాగమణి ఆరోపించారు. మార్కెట్‌లో ధరలు పెరుగుతున్నా అధికారులు, సంబంధిత శాఖలు సమర్థవంతంగా పర్యవేక్షణ చేయకపోవడం వల్ల వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతున్నారని అన్నారు.ఒకవైపు ఆదాయం పెరగక, మరోవైపు నిత్యావసరాల ధరలు పెరుగుతుండటంతో మధ్యతరగతి వారు కుటుంబ బడ్జెట్‌ను ఎలా నిర్వహించాలో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలపై ధరల పెరుగుదల ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, అక్రమ నిల్వలుకృత్రిమ కొరతకు అడ్డుకట్ట వేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ వినియోగదారులకు అందుబాటు ధరలో నిత్యావసర వస్తువులు లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జమ్మలమడక నాగమణి డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే చర్యలు తప్పవు

- తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కబ్జాకు యత్నం
- నోటీసులు జారీ చేసిన రెవెన్యూ అధికారులు



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 28:**-ప్రభుత్వ రెవెన్యూ డీకేటీ భూములను తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిద్ధవటం మండల తహసీల్దార్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 873/3లో 16.40 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల ద్వారా గుర్తించామని తెలిపారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు బొగ్గిడి వారి పల్లె, ఉప్పరపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించినట్లు గుర్తించి వారికి నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సదరు భూమిని ఎవరికీ కేటాయించలేదని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించామని, నిర్మించిన గదులను శనివారం మధ్యాహ్నంలోపు తొలగిస్తామని తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తమ సిబ్బంది తో హెచ్చరిక బోర్డు నాటించారు. కార్యక్రమంలో వీఆర్వో రేణుక తదితరులు పాల్గొన్నారు.

## వైవియులో అక్రమ నియామకాలు ఆప్కాస్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఫిర్యాదు

- ఏపీ జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు
- రాష్ట్ర సచివాలయం,ఫైనాన్స్ సెక్రటరీ,ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి వై వి యు ఆప్కాస్ ఉద్యోగుల సమస్యలు

**కడప మన జనప్రగతి ఆగస్టు 28:**-కడప యోగివేమన విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఉద్యోగ నియామకాలు అవకతవకలు యూనివర్సిటీలో ఈఎస్ఐ ఈపీఎఫ్ వంటి సదుపాయాలు కల్పించే ప్రయత్నాలు చేస్తూ అధికారులు నిధులను పక్కదారి పట్టించడం జరుగుతున్నదని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం కడప జిల్లా ఆప్కాస్ ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులు ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు, వై వి యు యూనివర్సిటీ నాయకులు తప్పెట చంద్రశేఖర్ రెడ్డి. నరెడ్డి రమేష్ రెడ్డి. పీవీ రాధాకృష్ణ. మాచునూరు అనిల్ కుమార్ రెడ్డి.కలిసి ఏపీ జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తో కలిసి యూనివర్సిటీ లో జరుగుతున్న సమస్యలపై ఆయన దృష్టికి తెచ్చారు. ఫైనాన్స్ సెక్రటరీ. ప్రిన్సిపల్ సెక్రెటరీ. వారి వారి కార్యాలయంలో కలిసి యూనివర్సిటీ లో జరుగుతున్న అవకతవకలపై ఫిర్యాదు చేశారు. రాష్ట్ర సచివాలయంలో వై వి యు సంబంధించిన సమస్యలు అక్కడ అధికారులకు వివరించారు, యూనివర్సిటీలో జరుగుతున్న అవకతవకలు ఉద్యోగ నియామకాలు విషయంపై వెంటనే చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ ఆప్కాస్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ నాయకులు వారిని కోరారు, ఏపీ జెఎసి అమరావతి పిలుపుమేరకు విజయవాడ మాకినేని బసవ పున్నయ్య ఆడిటోరియంలో జరిగిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సేవ సంఘాల ఐక్య కార్యచరణ సమితి జరిపిన ఉద్యమ సన్నాహక సభ సమీక్షా సమావేశంలో కడప జిల్లా ఆప్కాస్ ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులు పాల్గొన్నారు,




## సిద్ధవటంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

- అన్నాచెల్లెళ్ల ఆప్యాయ అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ సంబరాలు



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 28:**-శ్రావణ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం సిద్ధవటం మండల వ్యాప్తంగా రాఖీ పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని సోదరీమణులు తమ సోదరుల చేతులకు ప్రేమతో రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోదరులు తమ అక్కాచెల్లెమ్మల వద్ద రాఖీలు కట్టించుకుని, వారికి జీవితాంతం అండగా నిలుస్తామని, కష్టసుఖాల్లో తోడుగా ఉంటామని ఆప్యాయంగా భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని మిఠాయిలు పంచుకుంటూ పండుగను సంతోషంగా జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలల్లో చిన్నారులు, యువతీ యువకులు సైతం రాఖీలు కట్టుకుని సోదరభావాన్ని చాటుకున్నారు. అనంతరం సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు బహుమతులు అందజేసి ప్రేమాభిమానాలను వ్యక్తం చేయడంతో ప్రతి ఇంట పండుగ వాతావరణం నెలకొంది.

## ప్రముఖ కవి సాహితీవేత్త కందుకూరి మృతి తెలుగు వారికి తీరని లోటు..ప్రముఖుల నివాళి



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 28:**-ప్రముఖ కవి సాహితీవేత్త కందుకూరి లక్ష్మీనరసింహ మూర్తి సోమవారం మృతి చెందారని ఆయన మృతి తెలుగు భాషా ప్రేమికులు సాహితీవేత్తలు కవులు కళాకారులకు తీరనిలోటని నిడసన మెట్ల శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమందిని కవులు కళాకారులుగా తీర్చిదిద్దిన ఘనత , ఈయనకే దక్కుతుందని తెలుగు భాష ఉన్నంత కాలం ఆయన రచించిన గ్రంథాలు కవిత్వాలు చిరస్మరణీయంగా అందరికీ గుర్తు ఉంటాయని ఆయన మృతికి ఆయనబంధు మిత్రులు పలువురు ఘనంగా నివాళులర్పించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని తమ ప్రగాఢ సానుభూతిని నిడసస మెట్ల శేషగిరిరావు, నిట్టల వేంకట సత్యనారాయణమూర్తి, జి, వి ఎస్ ఎన్, శర్మ, డివివి సత్యనారాయణ తదితరులు తెలిపారు.నరసింహ మూర్తి సోమవారం మృతి చెందారని ఆయన మృతి తెలుగు భాషా ప్రేమికులు సాహితీవేత్తలు కవులు కళాకారులకు తీరనిలోటని నిడసన మెట్ల శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది కవులు కళాకారులుగా తీర్చిదిద్దిన ఘనత , ఈయనకే దక్కుతుందని తెలుగు భాష ఉన్నంత కాలం ఆయన రచించిన గ్రంథాలు కవిత్వాలు చిరస్మరణీయంగా అందరికీ గుర్తు ఉంటాయని ఆయన మృతికి ఆయన బంధు కోటి  పలువురు ఘనంగా నివాళులర్పించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని తమ ప్రగాఢ సానుభూతిని నిడసస మెట్ల శేషగిరిరావు, నిట్టల వేంకట సత్యనారాయణమూర్తి, జి, వి ఎస్ ఎన్, శర్మ, డివివి సత్యనారాయణ తదితరులు తెలిపారు.

## రిజర్వేషన్ల ప్రకటన తర్వాతే అభ్యర్థుల ఎంపిక

- టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసరెడ్డి




**కడప మన జనప్రగతి ఆగస్టు 28:**-కడప కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతే అభ్యర్థులను ప్రకటిస్తామని టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కులాల జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం రిజర్వేషన్లను నిర్ణయిస్తుందని, అనంతరం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపడతామని చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల ఓట్లతోనే ఎన్నికలను ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.గతంలో వైసీపీ పాలనలో దౌర్జన్యాలకు పాల్పడిన పరిస్థితులు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం వైసీపీకి ప్రజల్లో సానుకూలత లేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజల మద్దతుతో టీడీపీ విజయాన్ని సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత మూడు నెలలుగా సగటు వర్షపాతంలో లోటు నమోదవుతోందన్నారు. కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత తగ్గడంతో శ్రీశైలానికి ఆశించిన స్థాయిలో వరద నీరు చేరలేదని చెప్పారు.ప్రస్తుతం గండికోటలో 12.7 టీఎంసీలు, చిత్రావతి జలాశయంలో 6.4 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని తెలిపారు. తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగిస్తున్నామని చెప్పారు. రైతులు ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రాయలసీమకు సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. హంద్రీ-నీవా ప్రాజెక్టును రూ.5 వేల కోట్లతో పూర్తి చేశామని, గండికోటజీఎన్ఎస్ఎస్ కాలువ పనులను పూర్తి చేసేందుకు రూ.1,500 కోట్లతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాయలసీమకు నీటిని తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి నీటిని విడుదల చేయించేందుకు వైసీపీ కూడా ప్రయత్నించాలని ఆయన డిమాండ్ చేశారు.

## వృద్ధాశ్రమంలో మిత్రుడి జన్మదిన వేడుకలు

- వృద్ధులకు దుస్తుల పంపిణీ..అన్నదానం





**కడప మన జనప్రగతి ఆగస్టు 28:**-కడప నగరంలోని జిల్లా పరిషత్ దగ్గర ప్రేమాలయ వృద్ధాశ్రమంలో దొరై స్వామి జన్మదిన వేడుకలను కడప టిడిపి ఉపాధ్యక్షులు.ఎంబీసీ చైర్మన్ కత్తి రవీంద్ర,ఆయన మిత్రబృందం ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు., వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి, వారికి దుస్తులు పంపిణీ చేయడంతో పాటు అన్నదానం చేశారు.ఈ సందర్భంగా కత్తి రవీంద్ర, కొండా సుబ్బయ్య మాట్లాడుతూ..దొరై స్వామి ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఎదిగిన వ్యక్తి అని తెలిపారు. సమాజంలోని అభాగ్యులు, వృద్ధులకు తనవంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.జన్మదిన వేడుకలను వృద్ధుల మధ్య నిర్వహించి, వారికి చేయూతనివ్వడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కత్తి సాయి కుమార్, రవి, మధు, హరి ప్రసాద్, సాయి, కుమార్,  మిత్రబృందం సభ్యులు పాల్గొన్నారు.

మనజనప్రగతి
29- 08 - 2026

# కొండపేటలో శ్రీ బలరామ పూర్ణిమ మహోత్సవం..

**● నగర సంకీర్తన వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది ఇస్కాన్ భక్తులు**




**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 28:-**చెన్నూరు మండలం కొండపేట రామాలయం వేదికగా శుక్రవారం శ్రీ బలరామ పూర్ణిమ మహోత్సవంలో భాగంగా ఉదయం శ్రీకృష్ణ మందిరం, రామ మందిరంలో ఇస్కాన్ భక్తులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు, సాయంత్రం 4: 40 నిమిషాలకు వందలాదిమంది ఇస్కాన్ భక్తులచే నగర సంకీర్తన కొండపేట పురవీధుల గుండా సాగింది, శ్రీకృష్ణ మందిరం దగ్గర నుంచి హరే రామ హరే కృష్ణ కీర్తనలు పాడుతూ పురవీధుల గుండా ప్రధాన రామాలయం వరకు కొనసాగింది, రామాలయం వేదికగా బలరామకృష్ణ లను మంటప మందిరం గా ఏర్పాటుచేసి విగ్రహాలను ఉంచారు, వందలాదిమంది భక్తులు మందిర ఆవరణంలో ఆసీనులుగా సాయంత్రం6:00 గంటలకు శ్రీ శ్రీ కృష్ణ బలరాముల దివ్య దర్శనం, హరే నామ సంకీర్తన నిర్వహించారు, ఇస్కాన్ భక్తులచే సాయంత్రం6:50 నిమిషాలకు మహా శంఖాభిషేకం, మహా పుష్పాభిషేకం, మహా హారతి నిర్వహించారు, ఈ కార్యక్రమానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ నిర్వహిస్తారు, రాత్రి7:20 నిమిషాలకు నాటక ప్రదర్శన భగవద్గీత ప్రవచనం నిర్వహించారు, సాయంత్రం6:20 నిమిషముల నుండి మహా అన్న ప్రసాద వితరణ వేలాదిమంది భక్తులకు అందించారు, ఈ కార్యక్రమానికి వేలాదిమంది భక్తులు హాజరయ్యారు,చెన్నూరు కాజీపేట మైదుకూరు కడప కమలాపురం ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి ఇస్కాన్ భక్తులు భారీగా తరలివచ్చారు,

# వరి,మిరప పంటలను సాగు చేయొద్దు..

**● మండల వ్యవసాయ అధికారి సాయికుమార్**



**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 28:-**ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మండలంలో అధిక నీటి అవసరం ఉన్న వరి,మిరప పంటలను రైతులు సాగు చేయవద్దని మండల వ్యవసాయ అధికారి సాయికుమార్ సూచించారు, అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం వరుణ దేవుడు ప్రభావం తక్కువగా ఉన్నందున తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నందున ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలైన మొక్కజొన్న, జొన్న, అనప తదితర పంటలను సాగు చేయాలని కోరారు,ఖరీఫ్ 2026లో బొమ్మనహాల్ మండల సాధారణ సాగు విస్తీర్ణం 10,770 హెక్టార్లు కాగా ఇప్పటివరకు 3,653 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయని తెలిపారు,గత ఏడాది ఇదే సమయానికి 10,535 హెక్టార్లలో సాగు జరిగినట్లు పేర్కొన్నారు, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 80 శాతం రాయితీపై ఉలవలు, కొర్రలు,జొన్నలు,అలసందలు, కందుల విత్తనాలను రైతులకు అందుబాటులోకి తెస్తోందన్నారు,మండలానికి ఉలవలు 500 క్వింటాళ్లు, కొర్రలు 100,జొన్నలు 400, అలసందలు 70,కందులు 15 క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు,ఖరీఫ్‌లో ఎటువంటి పంట సాగు చేయని పొలాలకు మాత్రమే ఈ రాయితీ విత్తనాలు అందిస్తామని స్పష్టం చేశారు, రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకుని విత్తనాలను పొందాలని,తప్పనిసరిగా సాగు చేయాలని సూచించారు, విత్తనాల వినియోగాన్ని ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా పరిశీలిస్తామని తెలిపారు,ప్రస్తుత సీజన్‌లో పంట సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవడంతో పాటు పంటను ధ్రువీకరించి ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు,బీమా చెల్లించిన రైతులు కూడా క్రాప్ బుకింగ్‌లో అదే పంటను నమోదు చేయించుకోవాలని తెలిపారు.ఈ ఏడాది నుంచి ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రయోజనం పొందాలంటే ప్రతి రైతుకు ఫార్మర్ ఐడీ తప్పనిసరిగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి సాయికుమార్ తెలిపారు.

# సంఘాల బలోపేతమే లక్ష్యంగా.. మండల సమైక్య సమావేశం

**- మండల ఏపియం,యం.సి.గంగన్న**




**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 28:-**స్థానిక తుంగభద్ర మండల సమైక్య కార్యాలయంలో మండల సమాఖ్య ప్రతినిధిలు,మరియు గ్రామ సంఘం అధ్యక్షులుతో సమావేశం నిర్వహించారు,ఈ సమావేశంలో మండల ఏపియం, యం.సి.గంగన్న మాట్లాడుతూ.. గత సమావేశం నిర్ణయాల సమీక్షతో పాటు సీఐఎఫ్ రికవరీ, నోడల్ బ్యాంకు ద్వారా సీఐఎఫ్ రుణాల మంజూరు,ఏసీఎల్‌పి, ఎంసీపీ,బ్యాంకు లింకేజీ అంశాలపై చర్చించారు, ముఖ్యంగా స్త్రీనిధి,ఉన్నతి రుణాల రికవరీ,కొత్త రుణాల మంజూరు,లోకోస్ యాప్‌లో ఎస్‌హెచ్‌జీ,వీఓ వివరాల అప్డేట్, ఎంబీకే రెగ్యులర్ సమావేశాల నిర్వహణ, ఎఫ్‌పీవో,ఎఫ్‌పీజీ సంఘాల వివరాల నవీకరణపై సమీక్షించారు,సభ్యుల జీవనోపాధుల అభివృద్ధి, ప్రాజెక్టుల అమలు అంశాలపై చర్చ జరిగింది,ఈ సమావేశంలో మండల సమైక్య ఓబీ సభ్యులు లక్ష్మీనరసమ్మ,లలితమ్మ, ఏపీఎం ఎం.సి.గంగన్న,ఎల్‌సీ, కామరాజు,సీసీలు,తిప్పయ్య, ఏర్రిస్వామి,ఖాజన్న,గవిసిద్ధ,మరియు అకౌంటెంట్ వరలక్ష్మి, రైతు సంఘం అకౌంటెంట్,వివిధ గ్రామ సంఘం లీడర్లు,వీఓఏలు, పాల్గొన్నారు.

# ప్రతిభకు వైకల్యం అడ్డు కాదు..!

**● దివ్యాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**





**చిత్తూరు మన జనప్రగతి ఆగస్టు 28:-**సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి వైకల్యం అడ్డు కాదని, పట్టుదలతో కృషి చేస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు.శుక్రవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 59 మంది దివ్యాంగులకు ఉచితంగా ద్విచక్ర వాహనాలను పంపిణీ చేశారు. ఒక్కో వాహనం విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఎవరికీ తీసిపోరని, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రతి వ్యక్తిలో ప్రత్యేక నైపుణ్యం ఉంటుందని, దివ్యాంగుల్లోనూ ఎంతోమంది ప్రతిభావంతులు ఉన్నారని తెలిపారు. పట్టుదలతో లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించి, దివ్యాంగుల ధ్రువపత్రాలు, సదరం సర్టిఫికెట్లను పరిశీలించిన అనంతరం అర్హులను ఎంపిక చేసి వాహనాలను పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. దాదాపు మూడు నెలల క్రితం నిర్వహించిన అలింకో శిబిరంలో సుమారు 5,300 మంది దివ్యాంగులను గుర్తించామని, వారికి రూ.6 కోట్ల విలువైన వివిధ సహాయ పరికరాలను సెప్టెంబర్ మొదటి వారంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఇప్పటివరకు జిల్లాలో వివిధ సబ్సిడీ కార్యక్రమాల ద్వారా దివ్యాంగులకు సుమారు రూ.15 కోట్ల విలువైన స్కూటీలు, ట్రైసైకిళ్లు, సైకిళ్లు, ఇతర సహాయ పరికరాలను అందించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి దివ్యాంగుడికి అవసరమైన సహాయం అందేలా భవిష్యత్తులోనూ చర్యలు కొనసాగిస్తామని చెప్పారు.చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉందనడానికి వాహనాల పంపిణీ కార్యక్రమం నిదర్శనమన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా దివ్యాంగులకు స్కూటర్లు, ట్రైసైకిళు అందించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇప్పటికే పీవీకేఎన్ గ్రౌండ్స్‌లో సుమారు 4,000 మంది దివ్యాంగులకు వారి అవసరాలకు అనుగుణంగా వివిధ సహాయ పరికరాలను అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, భవిష్యత్తులోనూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు.

# కళాజాతా వీధి నాటకం ద్వారా యువతకు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన







**రైల్వేకోడూరు మన జనప్రగతి ఆగస్టు 28:** యువత హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండటంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై జాగ్రత్తలు పాటించాలని కళాజాతా,వీధి నాటకం ద్వారా అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బ్రహ్మకుమారి సూచనలతో రైల్వేకోడూరు పట్టణంలోని రంగనాయకులపేట, బాలానగర్, సాయినగర్ ప్రాంతాలతో పాటు సాయి డిగ్రీ కళాశాలలో ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.కళాజాతా, వీధి నాటకం రూపంలో హెచ్ఐవీ సోకే మార్గాలు, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యువత ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలి, హెచ్ఐవీతో టీబీకి ఉన్న సంబంధం, వ్యాధి లక్షణాలపై విద్యార్థులు, యువత, ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీపై సరైన సమాచారాన్ని తెలుసుకుని, తమ చుట్టుపక్కల ఉన్న వారికి కూడా అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాస్ ఎన్జీవో సిబ్బంది, ఎల్ డబ్ల్యూ ఎస్ రామ సుబ్బారెడ్డి, ఐ సి టి సి కౌన్సిలర్ వాణి, ల్యాబ్ టెక్నీషియన్ చైతన్య, సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. పెంచలయ్య, కరస్పాండెంట్ పి. శ్రీనివాసులు, కళాశాల సిబ్బంది, యువత, గ్రామ ప్రజలు, ఆయా ప్రాంతాల పెద్దలు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు విజన్‌ను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో స్వర్ణ యూనిట్లదే కీలక పాత్ర

**● వార్షికోత్సవం సందర్భంగా వర్చువల్ సమీక్ష**

**● విజన్ యాక్షన్ ప్లాన్,పీ4,కీలక పనితీరు సూచికల పురోగతిపై సీఎం సమీక్ష**



**పీలేరు మన జనప్రగతి ఆగస్టు 28:-** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన విజన్‌ను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో స్వర్ణ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. స్వర్ణ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా విజన్ యాక్షన్ ప్లాన్, పీ4, కీలక పనితీరు సూచికల పురోగతిపై శుక్రవారం ముఖ్యమంత్రి ప్రత్యేక వర్చువల్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, విజన్ యాక్షన్ ప్లాన్ అమలు తీరు, పీ4 కింద గుర్తించిన బంగారు కుటుంబాల పురోగతి, కీలక పనితీరు సూచికల సాధనపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆయా కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, సాధించిన ప్రగతి, భవిష్యత్ కార్యాచరణపై అధికారులతో చర్చించారు.పీలేరు నియోజకవర్గం నుంచి నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, హెచ్ఎన్ఎస్ఎస్ నారాయణరెడ్డి, ఆర్డీవో విజయలక్ష్మి, డీఎల్‌డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డీవైఎస్‌వో, ఏఎస్‌వోలు, యువ నిపుణులు, స్వర్ణ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సిబ్బంది వర్చువల్ సమీక్షలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి లక్ష్యాలను సాధించేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులు నిర్ణయించారు.

# దోమల నివారణతోనే సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట






**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 28:-**మండల పరిధిలో బండూరు గ్రామం ఆర్‌డీటీ కాలనీలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు,ముఖ్యంగా ఇంట్లోని పాత్రలు,డ్రమ్ములు,పాత టైర్లు, కొబ్బరి చిప్పలు,కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలని సూచించారు,నీటి నిల్వలకు మూతలు పెట్టడం ద్వారా దోమలు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చని తెలిపారు, మురుగునీటి కుంటల్లో అబేట్ పిచికారీ చేసి,ఇంటింటికీ వెళ్లి లార్వా, జ్వరాలపై సర్వే నిర్వహించారు,ఈకార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్, అంగన్‌వాడీ కార్యకర్త వనజాక్షి, ఆశా కార్యకర్త శ్రావణి,కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో ఆర్మీ ఉద్యోగి మృతి



**సుండుపల్లి మన జనప్రగతి ఆగస్టు 28:-**సుండుపల్లి మండలం రెడ్డివారిపల్లెకు చెందిన ఆర్మీ ఉద్యోగి వాకా రవి (43) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు.గత 23 ఏళ్లుగా ఢిల్లీలో ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న రవి,అనారోగ్య కారణాలతో జూలై మొదటి వారంలో స్వగ్రామానికి వచ్చారు.చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. రవి మృతితో రెడ్డివారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. సుదీర్ఘకాలం దేశ సేవలో విధులు నిర్వహించిన రవి మృతిపట్ల గ్రామస్తులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# కె.వి.పల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

**- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి**

**- పాత నేరస్తులపై నిఘా పెంచాలి**



**కె.వి.పల్లి మన జనప్రగతి ఆగస్టు 28:-**కె.వి.పల్లి పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి శుక్రవారం తనిఖీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచి, అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని ఎస్పీ సూచించారు.పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ముఖ్యంగా మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేయడంతో పాటు గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమాలు నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని వివిధ రికార్డులను ఎస్పీ పరిశీలించారు. సిబ్బంది యోగక్షేమాలను ఆత్మీయంగా అడిగి తెలుసుకుని, విధుల్లో అంకితభావంతో పనిచేస్తూ పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కలకడ సీఐ బి.లక్ష్మన్న, ఎస్ఐ శివకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో శిశుమందిర్ విద్యార్థుల సౌభ్రాతృత్వ సందేశం..









**కరీంనగర్,మన జనప్రగతి ఆగస్టు 28:** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం, సామాజిక ఐక్యత, దేశభక్తి భావాలను ప్రజల్లో పెంపొందించాలనే ఉద్దేశంతో శ్రీ సరస్వతీ శిశు మందిర్ హైస్కూల్ విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కరీంనగర్‌లోని మంచిర్యాల చౌరస్తా, కోర్టు చౌరస్తా, భగత్‌సింగ్ సర్కిల్, కమాన్ సర్కిల్, విద్యానగర్ ప్రాంతాల్లోని దుకాణాలు, కార్యాలయాలు, వివిధ సంస్థలను సందర్శించి రాఖీలు కట్టారు. ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్, సివిల్ పోలీసు సిబ్బందికి విద్యార్థినులు ఆత్మీయంగా రాఖీలు కట్టి "మీకు మేము రక్ష... మాకు మీరు రక్ష... మనందరం దేశానికి రక్ష!" అనే సందేశాన్ని అందించారు. రాఖీ కేవలం అన్నాచెల్లెళ్ల అనుబంధానికి మాత్రమే ప్రతీక కాదని, పరస్పరం గౌరవించుకోవడం, అవసరమైనప్పుడు ఒకరికొకరు అండగా నిలవడం, సమాజ భద్రతకు కలిసి పనిచేయడం, దేశం పట్ల బాధ్యత కలిగి ఉండటానికి ప్రతీకగా నిలుస్తుందని విద్యార్థులు వివరించారు. విద్యార్థుల కార్యక్రమాన్ని పోలీసు సిబ్బంది అభినందిస్తూ, చిన్న వయసులోనే దేశభక్తి, సామాజిక బాధ్యత, సోదరభావం వంటి విలువలను పెంపొందించడం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ, పుస్తక జ్ఞానంతో పాటు సమాజంపై అవగాహన, సేవాభావం, క్రమశిక్షణ, బాధ్యత, భారతీయ సంస్కారాలను విద్యార్థుల్లో పెంపొందించడం శిశుమందిర్ విద్యా విధానంలో ముఖ్య భాగమని తెలిపారు. "మనమంతా ఒక కుటుంబం మన దేశం మనందరి బాధ్యత" అనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం ప్రజలను ఆకట్టుకోవడంతో పాటు రక్షాబంధన్‌ను కుటుంబ బంధం నుంచి సామాజిక బంధంగా విస్తరించే చక్కని సందేశాన్ని అందించింది. కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు పాక పావన కృష్ణ, పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, సభ్యులు కొత్తూరు ముకుదం, కరీంనగర్ విభాగ్ ఉపాధ్యక్షులు కోట లక్ష్మారెడ్డి, ఆచార్య బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్షాబంధన్ సందర్భంగా బండి సంజయ్‌కు రాఖీ కట్టిన సోదరి శైలజ



**కరీంనగర్ టౌన్ మన జనప్రగతి ఆగస్టు 28:** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ తన సోదరి శైలజతో రాఖీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సోదరి శైలజ బండి సంజయ్ కుమార్‌కు ఆత్మీయంగా రాఖీ కట్టి, మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ సందర్భంగా సోదరి చేత రాఖీ కట్టించుకున్న బండి సంజయ్ కుమార్, సోదరసోదరీ మణుల మధ్య ప్రేమానురాగాలకు ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు పరస్పరం అండగా నిలబడాలనే బాధ్యతను రక్షాబంధన్ గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. సోదరి శైలజ రాఖీ కట్టి బండి సంజయ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రజాసేవలో మరింత విజయవ ంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ సోదరికి శుభాకాంక్షలు తెలియ జేస్తూ, రక్షాబంధన్ పండుగ సోదరసోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం రక్షాబంధన్ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకచోట చేరి తమ ఆప్యాయతను చాటుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అదే స్ఫూర్తితో కరీంనగర్‌లో బండి సంజయ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు, అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు బండి సంజయ్ కుమార్‌కు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాలాభిషేకం



**మల్లంపల్లి మన జనప్రగతి ఆగస్టు 28:** మల్లంపల్లి మండలం భూపాల్‌నగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు చివరి విడత బిల్లులు విడుదల కావడంతో కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేయడంతో లబ్ధిదారుల్లో ఆనందం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు చివరి బిల్లులు మంజూరు కావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన అనంతరం లబ్ధిదారులకు చివరి విడత బిల్లులు అందడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. గతంలో బిల్లుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో ఉపశమనం కలిగించిందన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు ఎలాంటి జాప్యం లేకుండా బిల్లులు చెల్లించాలని కోరారు. చివరి బిల్లులు విడుదల కావడంతో లబ్ధిదారులు కూడా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ సొంతింటి నిర్మాణం పూర్తిచేసుకున్న నేపథ్యంలో బిల్లులు అందడం ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిడి రమణారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పత్తిపాక కుమారస్వామి, మాజీ సర్పంచ్ పసుల సాంబయ్య, సీనియర్ నాయకులు సెమిశెట్టి బక్కయ్య, కొలిపాక సాంబయ్య, నోరు వేణు, మురారి వెంకన్న, పెద్దబోయిన రాజు, కలాల సుదర్శన్, కానిగంటి ఓంకార్, చెక్క శివ, రావుల బసవయ్య, పెండల మాధవరెడ్డి, గీట్ల శ్రీనివాస్‌రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్‌కి రాఖీ కట్టిన కార్పొరేటర్ ఉమా రాణి..

**కరీంనగర్ జిల్లా మన జనప్రగతి ఆగస్టు 28:** రక్షాబంధన్ వేడుకల సందర్భంగా శుక్రవారం రోజు కేంద్ర హోంశాఖ రాష్ట్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కార్పొరేటర్ గొట్టేముక్కుల ఉమా రాణి వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కి రాఖీ కట్టి, అన్నాచెల్లెళ్ల పవిత్ర బంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల ఆప్యాయతను చాటుతూ జరిగిన ఈ వేడుకలో ఉమా రాణి మంత్రికి తిలకం దిద్ది, ఘనంగా రాఖీ కట్టి స్వీట్ తినిపించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని బండి సంజయ్‌కు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో మహిళల రక్షణ, భద్రతకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ఈ సందర్భంగా వారు కొద్దిసేపు ముచ్చటించారు.



## కౌన్సిలర్ కొయ్యడ శ్రీనివాస్‌కు రాఖీలు కట్టిన అక్కాచెల్లెళ్లు



**పరకాల: మన జనప్రగతి ఆగస్టు 28:** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పరకాల పట్టణంలోని 19వ వార్డులో అక్కాచెల్లెళ్లు, ఆడపడుచులు కలిసి స్థానిక కౌన్సిలర్, మాజీ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, అక్కాతమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతీకగా రక్షాబంధన్ నిలుస్తుందన్నారు. కుటుంబ బంధాలను, ఆత్మీయతలను గుర్తు చేసే ఈ పండుగ మానవ సంబంధాలకు గొప్ప నిదర్శనమన్నారు. తెలంగాణలో ప్రజా పాలన, ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. మహిళల సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 19వ వార్డు ఆడపడుచులతో కలిసి రక్షాబంధన్ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని శ్రీనివాస్ పేర్కొన్నారు.

## కస్తూరిబా బాలికల పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**ఏటూరునాగారం, మన జనప్రగతి ఆగస్టు 28:**

మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పరస్పరం రాఖీలు కట్టుకుని రక్షాబంధన్ పండుగ విశిష్టతను తెలియజేశారు. సోదరభావం, ఆత్మీయత, పరస్పర ప్రేమ, అనుబంధాలను పెంపొందించేలా వేడుకలను నిర్వహించారు. రక్షాబంధన్ పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం 9వ, 10వ తరగతి విద్యార్థినులకు స్టడీ టేబుల్స్‌ను అందజేశారు. చదువుపై విద్యార్థినులు మరింతగా దృష్టి సారించి, మంచి ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించడంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమానురాగాలకు ప్రతీక రక్షాబంధన్



**పరకాల, మన జనప్రగతి ఆగస్టు 28:** గన్నోజు శ్రీనివాసాచారి నివాసంలో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గన్నోజు శ్రీనివాసాచారికి ఆయన సోదరి అరుణదేవి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గన్నోజు శ్రీనివాసాచారి మాట్లాడుతూ అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ముల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయత, అనుబంధాలను మరింత పెంపొందించే గొప్ప పండుగ రక్షాబంధన్ అని అన్నారు. కుటుంబ బంధాలను గుర్తు చేస్తూ సోదరసోదరీమణుల మధ్య ప్రేమను చాటిచెప్పే ఈ పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రక్షాబంధన్ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ, పరకాల నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభకు పదును



**చంద్రగిరి మన జనప్రగతి ఆగస్టు 28:–** చంద్రగిరి మండలం తొండవాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం వ్యక్తిత్వ వికాసం, జ్ఞాపకశక్తి పెంపుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్విజ్ మాస్టర్ ఈ. రియాజ్ బాషా విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, మెమరీ ఇంప్రూవ్‌మెంట్‌పై పలు విలువైన సూచనలు, మెలకువలను వివరించారు. మలేషియాలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న కె. అర్జున్ కుమార్ ఆధ్వర్యంలో, తన సొంత ఖర్చులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, జ్ఞాపకశక్తిని మెరుగుపరచడం, సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవడం, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవడం వంటి అంశాలపై రియాజ్ బాషా అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువులోనే కాకుండా జీవితంలోనూ విజయవంతం కావాలంటే సమయపాలన, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథం ఎంతో అవసరమని ఆయన సూచించారు. జ్ఞాపకశక్తిని పెంపొందించుకునేందుకు సులభమైన పద్ధతులను విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్ విద్యాభ్యాసానికి, వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విదేశాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ స్వదేశానికి తన వంతు సేవ చేయాలనే ఉద్దేశంతో కె. అర్జున్ కుమార్ సొంత ఖర్చులతో విద్యార్థుల కోసం ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని ఉపాధ్యాయులు ప్రశంసించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. భాస్కర్ రావుకు క్విజ్ మాస్టర్ రియాజ్ బాషా కృతజ్ఞతలు తెలిపారు. అర్జున్ కుమార్ సేవాభావాన్ని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# పత్తికొండ సబ్‌జైలులో న్యాయ సేవాధికార సంస్థ ఆకస్మిక తనిఖీ

- ఖైదీల కేసులు,ఆరోగ్య పరిస్థితులపై ఆరా..
- ఉచిత న్యాయ సహాయం సద్వినియోగం చేసుకోవాలని సూచన





**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 28:**-జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి జోష్ణదేవి శుక్రవారం సాయంత్రం పత్తికొండ సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులోని న్యాయ సహాయ కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడిన అధికారులు వారి కేసుల వివరాలు, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జైలు పరిసరాలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందించారు. న్యాయ సహాయ కేంద్రం ప్రాధాన్యతను ఖైదీలకు వివరించి, న్యాయ సహాయ పెట్టెలను పరిశీలించారు.ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, న్యాయ సహాయ రక్షణ న్యాయవాదుల వ్యవస్థపై అవగాహన కల్పించారు.మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి సకాలంలో మందులు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం న్యాయ సేవల సహాయవాణి 15100 నంబర్‌పై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కారాగార ఇన్‌చార్జి సూపరింటెండెంట్లు, ప్రధాన న్యాయ సహాయ రక్షణ న్యాయవాది శివరామచంద్ర, ప్యానల్ న్యాయవాది సూరజ్‌నబి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి, భాస్కర్, బాలభాష, లోక్‌అదాలత్ క్లర్క్ రాఘవేంద్ర, పారా లీగల్ వాలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

# వేంపల్లెలో జూదరుల అరెస్టు.. రూ.1.51 లక్షల నగదు స్వాధీనం

**- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం:సీఐ నరసింహులు**

**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 28:**-వేంపల్లె పట్టణంలోని అలవలపాడు క్రాస్‌రోడ్డు సమీపంలోని నిమ్మతోటలో జూదం ఆడుతున్న 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 1.51 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ నరసింహులు తెలిపారు. జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఎస్సై తిరుపాల్ నాయక్ సిబ్బందితో కలిసి దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వెల్లడించారు. అరెస్టయిన వారిలో వేంపల్లె, మైదుకూరు,దువ్వూరు మండలాలకు చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నామని సీఐ నరసింహులు పేర్కొన్నారు.

# నీటి పొదుపుతోనే ఉద్యాన సాగు..!

- ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకోవాలి
- డ్రిప్ ఇరిగేషన్‌తో తక్కువ నీటితో అధిక ప్రయోజనం
- ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు



**వేముల మన జనప్రగతి ఆగస్టు 28:**-ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున ఉద్యాన రైతులు నీటి వనరులను పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఉద్యాన శాఖ డైరెక్టర్ డా. కె. శ్రీనివాసులు సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఉద్యాన పంటల పరిస్థితిని పరిశీలించేందుకు శుక్రవారం వేముల మండలంలోని వేల్పుల గ్రామంలో ఆయన పర్యటించారు.గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల ఉద్యాన తోటలను ఆయన సందర్శించి పంటల పరిస్థితి, నీటి లభ్యత, భూగర్భ జలాల స్థాయి, సాగునీటి వినియోగం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పంటల సాగులో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే పరిస్థితుల్లో నీటి లభ్యతపై ముందస్తు ప్రణాళిక అవసరమని డైరెక్టర్ తెలిపారు. ఉద్యాన పంటలకు అవసరమైన నీటిని వృథా చేయకుండా డ్రిప్ ఇరిగేషన్ ద్వారా మొక్కల వేర్లకు అవసరమైన పరిమాణంలో అందించాలని సూచించారు. తక్కువ నీటితో పంటలను సమర్థవంతంగా సాగు చేసేందుకు డ్రిప్ పద్ధతి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.రైతులు ఉద్యాన శాఖ అందిస్తున్న డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు వర్షపు నీటిని పొలాల్లో నిల్వ చేసుకునేలా వ్యవసాయ కుంటలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందుబాటులో ఉన్న సబ్సిడీలను వినియోగించుకుని నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలని తెలిపారు.నేలలో తేమను ఎక్కువ కాలం నిలుపుకోవడంతో పాటు కలుపు మొక్కలను నియంత్రించేందుకు వీడ్ మ్యాట్స్ ఉపయోగకరంగా ఉంటాయని డైరెక్టర్ పేర్కొన్నారు. వీడ్ మ్యాట్స్‌కు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని కూడా రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో ఉద్యాన పంటల సాగు చేపట్టాలని, అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరును పొదుపుగా వినియోగించుకోవాలని డైరెక్టర్ సూచించారు. నీటి సంరక్షణ, నేలలో తేమ పరిరక్షణ చర్యలు పాటించడం ద్వారా పంటల ఉత్పాదకతను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి హరి ప్రసాద్, పీడీ ఏపీఎంఐపీ బి.వి. రమణ, ఉద్యాన సహాయ సంచాలకులు రవిచంద్ర బాబు, డీపీఎం ప్రవీణ్, వేముల, పులివెందుల ఉద్యాన అధికారులు, ఆర్ఎస్‌కే సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# శ్రీ నాగమ్మ అవ్వ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

- ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు చేతుల మీదుగా నిర్మాణ పనులకు శ్రీకారం



**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 28:**-పత్తికొండ పట్టణంలోని గుత్తి బైపాస్ రోడ్డు నుంచి రామచంద్రపురం రోడ్డులోపల పొలాల్లో వెలసిన శ్రీ నాగమ్మ అవ్వ ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు,టీటీడీ ఎస్టిమేట్ ఇంజనీర్ నవీన్ చేతుల మీదుగా ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. శ్రీ వాణి ట్రస్ట్ సహకారంతో ఆలయ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హిందూ దేవాలయాలను అభివృద్ధి చేయడంతో పాటు పురాతన,గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలకు ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అందులో భాగంగానే పత్తికొండలో శ్రీ నాగమ్మ అవ్వ ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణం పూర్తయిన అనంతరం భక్తులకు ఆధ్యాత్మికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆలయం మరింత అభివృద్ధి చెందేందుకు భక్తులు, దాతలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. మాదాసి మాదారి కురువ తాలూకా అధ్యక్షులు పుండుకూర బ్రహ్మయ్య ఆధ్వర్యంలోనూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నరసింహ చౌదరి, బత్తిని లోకనాథ్, రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ వెంకటపతి, హరినాథ్, కడవల సుధాకర్, తెలుగు మహిళ అధ్యక్షురాలు ఈరమ్మ, బీజేపీ మండల అధ్యక్షుడు కరణం నరేష్, గోరవయ్య మైలారు, కైరుప్పల ఉరుకుందు, శ్రీరాములు, శ్రీనాథ్, వినోద్, రాజేష్, రంగస్వామి, రామాంజనేయులు, నాగరాజు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాశీ నుంచి కన్యాకుమారి వరకు యాదవులందరికీ

# ఉపయోగపడేలా భవన్ నిర్మాణం

- గొల్ల నరసింహ యాదవ్
- తిరుపతిలో ఘనంగా యాదవ భవన్ కార్యాలయ ప్రారంభం





**తిరుపతి మన జనప్రగతి ఆగస్టు 28:-** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల శ్రీవారి పాదాల చెంత తిరుపతి నగరంలో వాసుదేవ యాదవ్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న యాదవ భవన్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజామున శుభలగ్నంలో ఘనంగా ప్రారంభించారు. పార్టీలకతీతంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యాదవులు, సంఘం నాయకులు, శ్రేయోభిలాషులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి 4 గంటల మధ్య జరిగిన శుభకార్యక్రమంలో కార్యాలయంలో పాలు పొంగించడం, గోపూజ, హోమాలు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల ఉమా నరసింహ యాదవ్, తిరుపతి నగర మాజీ మేయర్ డాక్టర్ శిరీష, మునుశేఖర్ దంపతులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మాజీ రీజినల్ డైరెక్టర్ వి. పుష్పావతి, రామచంద్ర దంపతులు పాల్గొన్నారు. వాసుదేవ యాదవ్ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు, రిటైర్డ్ ఏఎస్పీ వి. గంగరాజు యాదవ్, సాంకేతిక సలహాదారులు కామాటి వరదరాజులు, బుసగాని లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి హేమంత్ కుమార్ యాదవ్, ఉపాధ్యక్షులు ఉల్లిపాయల ముని మేఘనాథం యాదవ్, కట్టా జయరామ్ యాదవ్, సంయుక్త కార్యదర్శి చింత భరణి యాదవ్, కార్యనిర్వహక కార్యదర్శి జల్లి తులసి యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే డాక్టర్ కారని మునుస్వామి యాదవ్ కుమారుడు డాక్టర్ హనీష్, చింత యాదవ్, రమణ యాదవ్, ఎల్ఐసీ కృష్ణ యాదవ్, కార్యవర్గ సభ్యులు పూల శ్రీనివాస యాదవ్, తేల నాగరాజు యాదవ్, తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి దంపూరి భాస్కర్ యాదవ్ దంపతులు, అఖిల భారత యాదవ మహాసభ యూత్ లీడర్ శంకర్ యాదవ్, యాదవ శ్రేయోభిలాషులు కృష్ణ యాదవ్, ఇంజన్ గిరి యాదవ్, కుడితి సుబ్రహ్మణ్యం యాదవ్, అడ్వకేట్ వై.ఎస్. యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసింహ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రారంభించిన ప్రాంగణాన్ని ప్రజలకు అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా పుట్టినరోజులు, చిన్నచిన్న శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ ప్రాంగణాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా యాదవ భవన్‌లో మిగిలిన నిర్మాణ పనులను కూడా దాతలు, యాదవ సోదరులు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. కాశీ నుంచి కన్యాకుమారి వరకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తిరుపతికి వచ్చే యాదవులందరికీ ఉపయోగపడే విధంగా యాదవ భవన్‌ను సంపూర్ణంగా అభివృద్ధి చేయాలన్నదే తమ ఆకాంక్ష అని తెలిపారు. యాదవ భవన్ నిర్మాణం, కార్యాలయ ప్రారంభోత్సవానికి సహకరించిన దాతలు, నాయకులు, యాదవ సంఘాల ప్రతినిధులు, శ్రేయోభిలాషులందరికీ వాసుదేవ యాదవ్ సేవా సంఘం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


# ప్రాంగణ ఎంపికల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 28:**-ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ లో క్యూ స్పైడర్స్ టెస్ట్ యంత్ర సాఫ్ట్వేర్ సొల్యూషన్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు కొలువులు దక్కాయి. ఈ సంస్థ వివిధ దశల్లో 20 మంది విద్యార్థులకు ఆన్లైన్, బృంద చర్చల ద్వారా వారిలోని మేధస్సును గుర్తించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ప్రాంగణ ఎంపికల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం పట్ల ఆచార్య గడ్డం విజయప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులనుఅడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. పి. రవి కుమార్, డీన్ అకాడెమిక్స్ రమేష్ డొండ్కర్ అభినందిస్తూ,వారి భవిష్యత్ వృత్తి జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ ఎన్.సత్యానందరామ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జి.ఎస్. సుందర్, అధ్యాపకులు, కెరీర్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ బృందాన్ని విశ్వవిద్యాలయ యాజమాన్యం అభినందించింది.

# అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టకే డ్రోన్ బీట్


**- వేంపల్లి సీఐ నరసింహులు**





**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 28:**-గ్రామాలు, పట్టణ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ బీట్ నిర్వహిస్తున్నట్లు వేంపల్లి పట్టణ సీఐ నరసింహులు తెలిపారు. శుక్రవారం వేంపల్లిలోని రాజీవ్‌నగర్ కాలనీ, అలవలపాడు రోడ్డు, హనుమాన్ జంక్షన్, గాజులపేట తదితర ప్రాంతాల్లో పోలీసులు డ్రోన్ బీట్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచేందుకు డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తారని ఆయన పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ నరసింహులు హెచ్చరించారు.

# అన్నా చెల్లెళ్ల అనుబంధానికి రాఖీ పౌర్ణమి రక్ష



**తొండూరు మన జనప్రగతి ఆగస్టు 28:**-రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తొండూరు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నా చెల్లెళ్ల మధ్య అపూర్వమైన అనుబంధం వెల్లివిరిసింది. ఇనగలూరు గ్రామంలో భాను ప్రకాశ్‌రెడ్డికి ఆయన సోదరి దీక్షిత్‌రెడ్డి రాఖీ కట్టి సోదరాభిమానాన్ని చాటుకున్నారు. తెల్లవారుజాము నుంచే కొత్త దుస్తులు ధరించిన సోదరీమణులు పూజా సామగ్రి, రాఖీలు, స్వీట్లతో సిద్ధమయ్యారు. సోదరుల నుదుట తిలకం దిద్ది, హారతి ఇచ్చి రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా సోదరీమణులు తమ సోదరులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సోదరులు సైతం తమ చెల్లెళ్లకు జీవితాంతం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దీంతో మండలంలోని గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలు ఆత్మీయత, ఆనందోత్సాహాల మధ్య సాగాయి.

మనజనప్రగతి
29- 08 - 2026

# స్థానిక వ్యాపారుల ప్రయోజనాలే టీడీపీ లక్ష్యం..!

## షాపింగ్ మాల్స్ ఏర్పాటును పూర్తిగా వ్యతిరేకిస్తా..: డాక్టర్ జి.వి. ప్రవీణ్ కుమార్ రెడ్డి

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 28:**–స్థానిక వ్యాపారుల ప్రయోజనాలను కాపాడటమే టీడీపీ ప్రధాన లక్ష్యమని, ప్రొద్దుటూరులో కొత్త షాపింగ్ మాల్స్ ఏర్పాటును తాను పూర్తిగా వ్యతిరేకిస్తానని టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ డాక్టర్ జి.వి. ప్రవీణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. స్థానిక వ్యాపారులకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి వ్యక్తిగతంగా కూడా తన మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రొద్దుటూరులో సీఎంఆర్ షాపింగ్ మాల్, డీమార్ట్, రిలయన్స్ మార్ట్ వంటి వాణిజ్య సంస్థలకు గతంలో అనుమతులు ఎవరి హయాంలో మంజూరయ్యాయో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. స్థానిక వస్త్ర వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ ఆయా సంస్థలకు అనుమతులు ఇచ్చారని రాచమల్లు శివప్రసాద్ రెడ్డిపై ఆరోపణలు చేశారు. ప్రస్తుతం వ్యాపారుల ఓట్లను దృష్టిలో పెట్టుకుని మాల్స్ అంశాన్ని రాజకీయంగా ప్రస్తావిస్తున్నారని విమర్శించారు. కరోనా సమయంలోనూ వ్యాపారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసి దుకాణాలు తెరవడానికి అనుమతులు ఇచ్చారంటూ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఎస్ఎస్ మాల్ విషయంలో ఒకసారి అనుమతులు ఇచ్చి, అనంతరం దానికి తనకు సంబంధం లేదని చెప్పడం సమంజసం కాదన్నారు. గత ఎన్నికల్లో ఎదురైన పరాజయానికి గల కారణాలపై రాచమల్లు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. నాయీ బ్రాహ్మణుల సమస్యలపై మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, తానే గతంలో ఓ సెలూన్‌ను ప్రారంభించిన విషయాన్ని మరిచిపోయారా అని ప్రశ్నించారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రారంభమైన పలు దుకాణాలు ప్రస్తుతం మూతపడిన విషయాన్ని కూడా పరిశీలించుకోవాలని అన్నారు.భారతి సిమెంట్



పరిశ్రమలో స్థానికులు, స్థానికేతరులకు ఎంతమందికి ఉద్యోగాలు లభించాయో కలిసి పరిశీలిద్దామని ప్రవీణ్ కుమార్ రెడ్డి సవాల్ చేశారు. పరిశ్రమలో స్థానికుల కంటే స్థానికేతరులే అధికంగా పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రొద్దుటూరులో భవిష్యత్తులో కొత్త షాపింగ్ మాల్స్ ఏర్పాటుకు ఎవరైనా ప్రయత్నాలు చేస్తే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని అడ్డుకునేందుకు సాధ్యమైనంత వరకు కృషి చేస్తానని తెలిపారు. స్థానిక వ్యాపారుల ప్రయోజనాలను కాపాడేందుకు టీడీపీ ఎల్లప్పుడూ వారికి అండగా నిలుస్తుందని డా.జి.వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రొద్దుటూరు అభివృద్ధికి పెట్టుబడులు,పరిశ్రమలు అవసరం

**• ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 28:**–పట్టణంలో కార్పొరేట్ సంస్థలు ఏర్పాటు కావడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. శుక్రవారం నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ...మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి హయాంలోనే పలు కార్పొరేట్ సంస్థలు ప్రొద్దుటూరుకు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం పట్టణంలో ఇప్పటికే అనేక సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, భవిష్యత్తులో మరిన్ని సంస్థలు ప్రొద్దుటూరుకు వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.కార్పొరేట్ సంస్థల రాకను అడ్డుకోవడం వల్ల పట్టణ అభివృద్ధికి నష్టం జరుగుతుందని అన్నారు. కొత్త సంస్థలు, పెట్టుబడులు రావడం ద్వారా వ్యాపార కార్యకలాపాలు విస్తరించి, ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా అనేక మందికి ఉపాధి లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే మాజీ ఎమ్మెల్యే రాచమల్లు కార్పొరేట్ సంస్థలపై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆరోపించారు.ప్రొద్దుటూరు అభివృద్ధి, స్థానిక యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు ఘంటశాల వెంకటేశ్వర్లు, చల్లా రాజగోపాల్ యాదవ్, శ్రీనివాసాచారి, సుంకర మురళీ తదితరులు పాల్గొన్నారు.

# పెన్నానగర్‌లో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్.!

## 28 ద్విచక్ర వాహనాలు స్వాధీనం..

## అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 28:**–ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక కార్యకలాపాలపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపుతోందని ప్రొద్దుటూరు ఏఎస్పీ విభుకృష్ణ, ఐపీఎస్ స్పష్టం చేశారు.కడప జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ప్రొద్దుటూరు ఏఎస్పీ విభుకృష్ణ ఐపీఎస్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు పెన్నానగర్ ప్రాంతంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితులుగా ఉన్న సస్పెక్ట్ షీటర్లు,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తుల ఇళ్లను గుర్తించి ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో భాగంగా 28 మోటార్



వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఏఎస్పీ తెలిపారు.అక్రమ మద్యం,గంజాయి,ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా,పేకాట,బెట్టింగ్,రౌడీయిజం,ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని, అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ప్రత్యేక తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వ్యక్తులు ఎంతటి వారైనా వారి స్థాయి, హోదాతో సంబంధం లేకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలా పాలు జరుగుతున్నట్లు గుర్తించిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏఎస్పీ విభుకృష్ణ తెలిపారు. ప్రజల భద్రత విషయంలో రాజీ లేదు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు” అని ఆయన స్పష్టం చేశారు. కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో ప్రొద్దుటూరు సబ్ డివిజన్‌కు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ పై దాడి చేసిన ఇద్దరు నేరస్తుల అరెస్ట్



**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 28:**–ఆటో డ్రైవర్‌పై దాడి చేసి ఆటో,నగదు,మొబైల్ ఫోన్ దోపిడీ చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు రైల్వేకోడూరు గ్రామీణ పోలీస్ సర్కి ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. పుల్లంపేట సఖి ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వారి వద్ద నుంచి దోపిడీ సొత్తుతో పాటు నేరానికి ఉపయోగించిన ఆయుధాలను, నగదు ఆటో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జూలై 31వ తేదీ రాత్రి రాజంపేటలో ఆటో డ్రైవర్ మేకల హనుమంతు వద్దకు వచ్చిన నిందితులు ఇద్దరూ ఆటోను బాడుగకు మాట్లాడుకుని, అనంతసముద్రం పరిసర ప్రాంతంలోని జనసంచారం తక్కువగా ఉన్న ప్రాంతానికి తీసుకెళ్లారని తెలిపారు. ఆటోలో ఉన్న ఇనుప రాడ్డు, రింగ్ స్పానర్లను తీసుకుని డ్రైవర్‌పై దాడి చేసి గాయపరిచి అతని వద్ద ఉన్న రూ.6,000 నగదు, వీవో మొబైల్ ఫోన్‌తో పాటు ప్యాసింజర్ ఆటోను బలవంతంగా దోపిడీ చేసి పరారయ్యారని తెలిపారు.కేసు నమోదు అనంతరం పుల్లంపేట పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేసి నిందితుల ఆచూకీ కోసం వివిధ కోణాల్లో ఆధారాలు సేకరించారు. ఈ క్రమంలో ఆగస్టు 27 సాయంత్రం పుల్లంపేట వద్ద నిందితులు హస్తవరం ఈశ్వరయ్య (26), బాలిపోగు రెడ్డెయ్య (25)లను పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు. విచారణలో నేరానికి సంబంధించిన వివరాలు వెలుగులోకి రావడంతో, వారి సమాచారంతో దోపిడీకి ఉపయోగించిన ఆయుధాలతో పాటు దోపిడీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మరో వ్యక్తి వద్ద కుదువ పెట్టిన వీవో మొబైల్ ఫోన్‌ను కూడా చిన్న ఓరంపాడు వద్ద స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.ప్రజలు రాత్రి వేళల్లో ప్రయాణించే సమయంలో అపరిచితులను నమ్మి జనసంచారం లేని ప్రాంతాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు ప్రయాణికులను తీసుకెళ్లేటప్పుడు సాధ్యమైనంత వరకు వారి వివరాలను గమనించాలని, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీస్ అత్యవసర సేవలకు సమాచారం అందించాలని కోరారు. నేరాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినట్లయితే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు. నేరస్థులు ఎంతకాలం తప్పించుకున్నా చట్టం నుంచి తప్పించుకోలేరని సిఐ శ్రీనివాసులు హెచ్చరించారు

# వేతనాలు,చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని జడ్పీటీసీల ఆవేదన



## - ఈ జడ్పీటీసీలు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలి

**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 28:**–పంచాయతీరాజ్ చట్టం ద్వారా 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా ఏర్పడిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గానికి ఈ సమావేశమే చిట్టచివరిదని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల రావు పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడలోని జీఎంసీ బాలయోగి జడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్సీలు కుడిపూడి సూర్యనారాయణ రావు, పేరాబత్తుల రాజశేఖరం, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డీఆర్వో వి.సుబ్బారావు, రంపచోడవరం ఐటీడీఏ ఏవో రమణ, జిల్లా పరిషత్ సిఈఓ వివివిఎస్ లక్ష్మణ రావు తదితరులు హాజరయ్యారు. వీరితో పాటు వివిధ మండలాల జడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు ఈ సమావేశంలో పాల్గొని పలు కీలక అంశాలపై చర్చించారు.ప్రధానంగా నీటి పారుదల, వ్యవసాయం,ఉద్యానవనం, గ్రామీణ నీటి సరఫరా (ఆర్డబ్ల్యూఎస్) పారిశుధ్యం, వైద్య, ఆరోగ్యం, ఐటీడీఏ, పాఠశాల విద్య శాఖల పరిధిలో ప్రస్తుతం అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యకలాపాల పురోగతిని అధికారులు వివరించారు.తమకు జిల్లా పరిషత్ సుమారుగా ఏడాది కాలం నుండి గౌరవ వేతనాలు లేవని జడ్పీటీసీలు ఆవేదన వెళ్లగక్కారు.అలాగే తమ మండలాల్లో తాము చేసిన పనులకు ఇంతవరకు బిల్లులు చెల్లించకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చైర్మన్ వేణుగోపాలరావు స్పందిస్తూ మరో నెలలో పూర్తి పదవీకాలం ముగుస్తుందని ఈలోగా వారికి చెల్లించే అవకాశాన్ని సీఈవో లక్ష్మణరావు బాధ్యతగా తీసుకోవాలన్నారు.ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ ప్రస్తుతం సభలో ఉన్న జడ్పిటిసిలు మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని సూచించారు. ఈ ఐదేళ్ల కాలంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ కార్యవర్గానికి సంపూర్ణంగా సహకరించిన నాలుగు జిల్లాల అధికారులకు, తన తోటి గౌరవ జడ్పీటీసీ సభ్యులకు, మంత్రులకు, ఎమ్మెల్సీలకు, ఎమ్మెల్యేలకు, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్‌లకు, మీడియా ప్రతినిధులకు ఆయన ఈ సందర్భంగా చైర్మన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రస్తుత జెడ్పీ కార్యవర్గానికి సెప్టెంబర్ 24 వరకు కాలపరిమితి ఉందని, ఈలోపు సభ్యులందరితో కలిసి ఒక ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సిఈఓ శ్రీలలిత, పరిపాలన అధికారి మందపల్లి బుజ్జిబాబు, ఇతర జెడ్పీ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ భవనాలు తమకు అప్పగించాలని పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా

**- తాత్కాలికంగా పోలీసు కార్యాలయానికి ఇచ్చిన భవనాలను తిరిగి ఇవ్వాలని డిమాండ్**




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 28:**రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల హాస్టల్ భవనాలను తిరిగి తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు శుక్రవారం కళాశాల గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల లవకుమార్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది విద్యార్థులు తరగతులను బహిష్కరించి ప్లకార్డులు చేతబట్టి నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా లవకుమార్ మాట్లాడుతూ 2022లో అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని ప్రకటించిన సమయంలో ఎస్పీ కార్యాలయం కోసం పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ భవనాలను ప్రభుత్వం తాత్కాలికంగా స్వాధీనం చేసుకుందని తెలిపారు. ప్రస్తుతం జిల్లా పోలీసు కార్యాలయాలు మదనపల్లెకు తరలిపోయిన నేపథ్యంలో హాస్టల్ భవనాలను తిరిగి విద్యార్థులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.కళాశాలలో సుమారు 250 మంది విద్యార్థులు చదువుతున్నప్పటికీ ప్రస్తుతం సరైన హాస్టల్ వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇతర ప్రభుత్వ హాస్టళ్లలో సీట్లు లభించక కొంతమంది విద్యార్థులు నెలకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు చెల్లించి ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి హాస్టల్ భవనాలను వారికి అప్పగించాలని కోరారు.హాస్టల్ భవనాలను విద్యార్థులకు అప్పగించే వరకు ఏఐఎస్పీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని లవకుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో పాటు ఏఐఎస్పీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174